ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10-00.

సమర్థ సద్గురు

నవంబర్
2026



29-08-2026 నుండి 01-10-2026 వరకు

కట్టమూరు గ్రామ బాబు భక్త సమాజ్ వారు నిర్వహించిన

సత్సంగ కార్యక్రమ దృశ్యములు.









సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళి మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 46 సంచిక 3
పేజీలు 44
నవంబర్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల..... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M **చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా మేనేజరు సమర్థ సద్గురు మాగజైన్ శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు గుంటూరు జిల్లా**

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

ఈ సంచికలో ..... పేజీ

శ్రీ కాళీ ప్రసాద శతకము 4
శ్రీబాబూజీ ఉవాచ..... 5
అమ్మమాట..... 7
శక్తి స్వరూపిణి జ్ఞానం 8
భగవద్గీత సాధన దీపిక 10
దైవసంకల్పం 12
శ్రీనాథ్‌జీ 14
శ్రీశ్రీశ్రీ హానుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః 16
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! ..18
నారద భక్తి సూత్రములు 20
వాదన 22
స్థితప్రజ్ఞుడు 23
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు.....25
రామస్యదూతమసక్యన్నమామి 26
నిరీక్షణ 29
శ్రీ గురుగీత 31
గురుకృప 33
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....36
జ్ఞానక్షీరం 38
దానశీలత్వం 40
విష్ణు కథలు 41

శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

18. ***మనసు తెరమీది బొమ్మలాట***
సంసారంబు, సంకల్పముల
రీలు తెగిన నది సమసిపోవు
కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥



తా: మనం సినిమాకు వెళ్తే అక్కడ తెరమీద అనేక బొమ్మలు కదులుతూ వుంటాయి. ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, ఏడుస్తూ మనలను కూడా అనేక భావోద్వేగాలకు గురిచేస్తూ వుంటాయి. అయితే తెరమీద ఈ బొమ్మలన్నీ ఎక్కడినుంచి వచ్చాయి? అవన్నీ ప్రొజెక్టరులో తిరిగే రీలుమీద ముద్రించబడి వున్నాయి. వాటి వెనుకనుండి పడే కాంతి ద్వారా ఈ బొమ్మలు తెరమీద ఆడుతున్నాయి. అదే మధ్యలో ఆ రీలు తెగిపోయిందనుకోండి, అప్పుడు తెరంతా స్వచ్ఛమైన తెల్లని కాంతి మాత్రమే పరుచుకుంటుంది. అలాగే మనం చూసే ఈ దృశ్యప్రపంచమంతా మన మనస్సులోని సంకల్పాలనే రీలు నుండి వచ్చినదే. ఆ మనసు వెనుకనున్న ఆత్మ ప్రకాశం చేత ఈ బొమ్మలాట ఎదురుగానున్న ప్రపంచమనే తెరమీద కనిపిస్తోంది. దీనినే మనం సంసారం అంటున్నాం. అయితే ఒక్కసారి మనస్సులో ఈ సంకల్ప పరంపర తెగిపోతే, మనస్సు నిస్సంకల్పమైతే అప్పుడిక బయటయినా, లోపలయినా కనిపించేదంతా ఆత్మ ప్రకాశమే. అక్కడ ఇంకొక వస్తువుకు తావులేదు. సినిమా చూస్తున్నంతసేపూ ఆ తెరపై కనిపించే భావోద్వేగాలను మనవిగా అనుభవిస్తున్నా, అది కేవలం నాటకమనే స్పృహ మనకు అంతర్లీనంగా అనుక్షణం ఉంటుంది. అందుకే తెరమీద ఎంతటి ఉపద్రవం సంభవిస్తున్నా, అందలి పాత్రలు అందుండి తప్పించుకోవాలని బలంగా కోరుకుంటామే తప్ప ఆ ఉపద్రవం నుంచి మనం పారిపోము. అలాగే ఈ సంసారమంతా మన సంకల్పాల నాటకమని నిశ్చయంగా ఎఱిగిననాడు, ఇందులో వచ్చే సుఖదుఃఖాలను కూడా సాక్షిమాత్రంగా చూడగలుగుతాం.

1) సాధువు చేసిన వింత పని ఏమిటి?
2) జ్ఞాన జిడ్డు ఎందుకు అవసరం?
3) కొండపై ఎవరి ఎడమచేయి మాత్రమే ప్రకటితమయింది?

శ్రీ బాబూజీ ఉవాచ - కే.శే. పరాశర ప్రసాద్

12-11-1981

ఈరోజు ఉదయం వాకింగ్ చేస్తుండగా శ్రీ బాబూజీ ఇంటర్వ్యూ నిమిత్తం ఇద్దరు ఇంజనీర్లు వచ్చారు. వాకింగ్ అయిన తర్వాత శ్రీ బాబూజీ వారికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఇద్దరు ఇంజనీర్లూ శ్రీ బాబూజీకి నమస్కరించి 'మీ బోధలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చదువుతాము. మేము మిమ్మల్ని కలుసుకోవాలని కోరిక కలిగి వచ్చాము' అని అన్నారు.



'చాలా సంతోషం నాయనా! నేనూ మీలాంటి వ్యక్తినే. నాకు రామ అనే రెండు అక్షరాలు తప్ప ఇంకేమీ తెలియదు. ఈరోజు మీలాంటి భక్తులని దర్శించటం నా భాగ్యం. రోజూ ఎంతోమంది నా దగ్గరకు వస్తుంటారు. వారంతా అనేక సంకల్పాలతో, కోర్కెలతో నన్ను దర్శిస్తూ ఉంటారు. ఇలా తత్త్వ విచారణ కోసం వచ్చేవారు చాలా తక్కువ. మహాత్ముల కరుణ అపారమైనది. దుఃఖ సాగరంలో మునిగిఉన్న మానవులను ఆదరించి వారి మనస్సును భగవానుని వైపుకు మరల్చటమే వారి కర్తవ్యం. కుమ్మరి పురుగును చూడండి. బురదలోనే ఉంటుంది. కాని దానికి బురద అంటదు. అలాగే విషయాదుల మధ్య ఉన్నప్పటికీ మనస్సు పరమాత్మపై లగ్నమైనపుడు ఆ విషయాదుల కర్మ అంటదు. అదే కర్మలో అకర్మ అనబడుతుంది. కుమ్మరిపురుగు బురదలో ఉన్నా దానికి బురద అంటక పోవటానికి కారణం దాని శరీరంపైన జిడ్డు ఉంటుంది. అలాగే నీకు జ్ఞానజిడ్డు అనే కవచం ఉన్నట్లయితే మనస్సు విషయాదులపైకి పోదు' అన్నారు శ్రీ బాబు.

ఇంజనీర్లు బాబూజీ బోధ విని "ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురించిన ఉపన్యాసాలలో మాకు రెండు సందేహాలు ఉన్నాయి" అన్నారు.

"చెప్పండి, మీ సందేహాలు తప్పక తీరుస్తాను" అన్నారు శ్రీ బాబు.

వారు వ్యక్తం చేసిన సందేహాలు: 1. శ్రీకృష్ణ పరమాత్ముడు పుట్టగానే వసుదేవుడు తీసుకొని వెళ్తుండగా ఒక్క రాధ మాత్రమే చూసిందని వ్రాశారు. మరి రాధ కృష్ణ పరమాత్ముని కన్నా వయస్సులో పెద్దదా? చిన్నదా? 2. కృష్ణ పరమాత్ముడు ఎప్పుడూ పిల్లనగ్రోవిని ఎందుకు తనవద్దనే ఉంచుకుంటాడు?

బాబూజీ నవ్వుతూ 'బాగున్నాయండి మీ సందేహాలు. శ్రీకృష్ణ పరమాత్మని మీరు ఏమని భావిస్తున్నారు? ఆయన సాధారణ మానవుడా? లేక అవతార పురుషుడా? శ్రీకృష్ణుడు పుట్టుక లేనివాడు. అసలు పుట్టలేదు. ఆయన ఆవిర్భవించాడు. గర్భనరకం అనుభవించ లేదు. మరి ఆయనకు వయస్సు ఏమిటి? ఆయన ఎవరికన్నా చిన్నవాడూ కాదు, పెద్దవాడూ కాదు.

మీరు కృష్ణపరమాత్ముడు ఎప్పుడూ పిల్లనగ్రోవిని ఎందుకు తన వద్దనే ఉంచుకుంటాడు అని అడిగారు కదా! అది ఆయనకు అత్యంత ప్రియమైనది. రాధ ఎల్లప్పుడూ శ్రీకృష్ణుని ధ్యానించినా, ప్రేమించినా పిల్లనగ్రోవిని చూసి ఈర్ష్యపడేది. పిల్లనగ్రోవి ఎప్పుడూ, శ్రీ కృష్ణుని నడుమునే ఉండేది. ఆయన అధరామృతాన్ని గ్రోలుతూ ఉండేది. ఆ భాగ్యానికి ఈర్ష్యపడేది రాధ. ఆ విషయాన్ని మురళినే అడగ నిశ్చయించింది రాధ. శ్రీకృష్ణ పరమాత్ముడు రాధకి ఆ అవకాశాన్ని కలగచేశాడు. శ్రీకృష్ణుడు తాను నిద్ర నటిస్తూ మురళిని నెమ్మదిగా జారవిడిచాడు. అది దొర్లుకుంటూ, దొర్లుకుంటూ పాదచాటున దాగి ఉన్న రాధ దగ్గరకు చేరింది. ఆ అవకాశాన్ని జారవిడుచుకోకుండా రాధ మురళికి తన సంశయాన్ని వెలిబుచ్చింది.

మురళి సమాధానం చెపుతూ, 'అమ్మా రాధా! నాలో ఏమి వుంది? ఏమీ లేదు. కేవలం నేను ఒక వెదురుగొట్టాన్ని. కేవలం ఏడు రంధ్రాలు మాత్రం ఉన్నాయి. నాలో ఏమీ లేకపోవటం వలననే స్వామిని ఆకర్షించగలిగాను' అని సమాధానం ఇచ్చింది. రాధ సర్వేసర్వత్రా ఆ కృష్ణ పరమాత్మనే దర్శించింది. మీరూ అలానే దర్శించవచ్చు' అని శ్రీ బాబూజీ వారిని ఆశీర్వదించారు.

అమ్మ మాట - జపమాలా ప్రసాద

ప్రతి శ్వాసా ఆఖరి శ్వాసే!

"నీటి బుడగకైనా యింత టైమని చెప్పవచ్చుగాని, మానవ జీవితానికింత టైమని చెప్పలేము. ఉత్తమమైన మానవజన్మ వచ్చి కూడా, కానివీ పోనివీ కర్మములు చేస్తూ, కాలుని బారిని పడిపోతున్నారు జనులు. మూఢులై, మాయా ప్రపంచంలోపడి, తప్పటడుగులు వేస్తూ సుఖశాంతులని కోల్పోతున్నారు. నారాయణ నామస్మరణతో జన్మని చరితార్థం చేసుకోమని మహాత్ముల ద్వారా, పరమహంసల ద్వారా, సాక్షాత్తు ఆ భగవానుడే నందేశానిస్తున్నా, పెడచెవిని పెడుతున్నాడు మానవుడు.



గీతాచార్యుడైన గోపాల నందనుడు, అర్జునుడిని గోవత్సంగా చేసి, సర్వోపనిషత్ సారమైన భగవద్గీతా క్షీరములను, ఆత్మబుద్ధి గల సుజనులందరికీ అందించాడు. 'గీత'ని తిరగవేస్తే, 'త్యాగీ' అవుతుంది. అంటే, నీలోని గుణాలన్నీ త్యాగం చేస్తే, ఆ నిత్యానందము నీలోనే వుందని చెపుతోంది. అంత్యకాలమందు, మన మనసు దేనిపై లగ్నమై వుంటుందో, తిరిగి మనకి ఆ జన్మే లభిస్తుందని, కనుక మన మనస్సు ఆ పరమాత్మయందు లగ్నం చేయాలని కృష్ణుడు చెప్తే, 'నా అంత్యకాలమెప్పుడో చెప్పు బావా! నా మనసుని భగవంతుని యందు లగ్నం చేస్తాను' అని అర్జునుడంటాడు. గీతాచార్యుడు నవ్వి, 'అర్జునా, నీ ప్రతి శ్వాసా, ఆఖరి శ్వాసే, కనుక అనుక్షణం, శ్వాస శ్వాసతో భగవన్నామ స్మరణ చేయాలి' అని సెలవిచ్చారు. కనుక అంత్యకాలమునందు మన మనస్సు, పరమాత్మ యందు నిలవడం కోసమే మనం చేసే సాధన అంతా కూడాను. ఆ భగవన్నామమనేది మనకి సమర్థులైన సత్య గురువుల వద్ద లభ్యమవుతుంది. ఆ గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును సాధన చేసి, గురువాజ్ఞ తు.చ. తప్పకుండా పాలన చేసిననాడు, మోక్షము మనకు కరతలామలకము అనుటకు ఏ మాత్రం సందేహము లేదు. కనుక, సర్వులు అట్టి సద్గురుదేవుల కృపా, కటాక్షమును గ్రోలి, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములతో, సుఖశాంతులతో వర్ధిల్లుదురుగాక!"

శక్తి స్వరూపిణి జ్ఞానం

- సన్నిధానం కాళీమాత

అద్వైత సాంప్రదాయములో రెండు సాధన పరంపరలు వున్నాయి. ఒకటి పరిణామ వాదము, రెండవది వివర్త వాదము. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని ఉపాసన చేసేవారు ఈ పరిణామ వాదమును అనుసరిస్తుంటారు. దీని ప్రకారము పరతత్వము యొక్క పురుష రూపమునకు ప్రకాశము అని పేరు. స్త్రీ రూపమైన పరతత్వమునకు విమర్శము అని పేరు. ఈ రెండు తత్వ అంశములలో ప్రకాశతత్వము దేశము, కాలము వంటి అవధులకు లోనుకానిది. ఈతని తత్వము 'ఇది' అని వివరించుటకు సాధ్యము కాదు. మాయకు లొంగని, మాయ కప్పివేయలేని స్వయం జ్యోతి స్వరూపుడు. దృశ్య ప్రపంచమంతా అతని పరిణామమే కాని, అంతని కంటే వేరు కాదు. కనుక అతనిని దర్శించగల వారికి మరి ఇంకేమీ గోచరము కాదు. ఇతడు ప్రకాశకుడు.

ఈ ప్రకాశకుని స్వభావికమగు 'స్పందన' రూపములో వుండే శక్తికి 'విమర్శము' అని పేరు. ఈ విధముగా ప్రకాశము అనే పేరుగల పరమాత్మ తత్వము యొక్క విభజించడానికి వీలుకాని స్పందన, స్ఫురణ, అహంత, విమర్శము అనే పేరులతో పిలువబడే శక్తికి సంబంధించిన తత్వ స్వరూపము, అనుభవ పూర్వకంగా తప్పక తెలుసుకోవాలి. ఆమెను తెలుసుకోవడం 4 విధాలుగా వివరించబడింది. అవి...1. అర్ధమయము - అనగా స్థూలము, సూక్ష్మము ఆకృతులతో వుండేవి. ఏ ఆకృతి లేకపోయినా బుద్ధికి మాత్రమే గోచరము అయ్యేవి. 2. శబ్దమయము - మానవుల వాక్కులు, పశుపక్ష్యాదుల అవ్యక్త ధ్వనులు మొ॥వి. 3. శ్రీ చక్ర మయము - సర్వ విశ్వమునందు గల పదార్థములకు సంకేతంగా, మరియు పరతత్వమునకు సంకేతంగా సాధకుల సాధనకు అనుకూలంగా నిలచిన శ్రీదేవి స్వరూపము. 4. దేహమయము - ఇది రెండు విధాలుగా వుంది. ఒకటి వ్యష్టి రూపము, రెండు సమష్టి రూపము. సాధకుని దేహము, మరియు వేరు వేరు ప్రాణుల దేహములలో వ్యష్టి రూపము. సమస్త విశ్వ సముదాయమును అఖండమగు ఏకైక వస్తువుగా చూడటం సమష్టి దేహము. ఈ రెండు విధములగు దేహములు శ్రీదేవీ పరిణామమే. ఆమె కంటే వేరు కావు. అట్టి పరతత్వమునకు మూలమైన శ్రీదేవీ స్వరూపమును తెలిసికొనుట సర్వులకూ కర్తవ్యము.

సాధకులు ఉపాసించే ఏ దేవతకైనా వారి అధికార భేదములను బట్టి మూడు రకములుగా వివరించబడింది. 1. ఉపాస్యమైన దేవతకు మానవుల వలే కాళ్ళు చేతులు మొ॥ అవయములు వున్నట్లు భావన చేసి, కావలసిన ప్రయోజనములను అనుసరించి,

ఆయుధములు, భుజములు ఆరు, ఎనిమిదిగా రూపకల్పన చేసి, ఆ మూర్తిని, లేదా చిత్రపటమును తన ముందు వుంచుకుని, లేదా హృదయమునందు భావన చేసి, స్తోత్రములు, పూజలు, మానసిక పూజలు చేస్తూ వుండటం. ఇటువంటి స్థూల రూపమునకు ఉపాసన చేయు సాధకులను మందాధికారులు అంటారు.

2. ఆయా దేవతల సకల తత్వములను తన యందు వుంచుకుని శబ్దాత్మక రూపములైన మంత్రమయ రూపమును, తమయందు వుంచుకున్న బీజాక్షరములుగా సాధన చేయు ఉపాసకులు. వీరికి కొంత అంతర్ముఖ దృష్టి వున్నప్పుడు మాత్రమే సాధ్యము. కనుక అట్టి సాధకులను మధ్యమాధికారులు అంటారు. వీరు స్థూల రూపమును ఉపాసన చేయు మందాధికారులకంటే పై తరగతికి చెందినవారు.

3. ఆయా ఉపాస్య దేవతల పరమార్థ రూపము నిరంతర భావగోచరమై ఎల్లప్పుడూ అందే వుండే వారు. వీరిని ఉత్తమాధికారులు అంటారు. పై రెండు సోపానములకు పైన చివరి మెట్టునకు చేరినవారు. అంతర్ముఖ దృష్టి కలిగినవారు.

మంద అధికారులుగాని, మధ్యమ అధికారులుగాని వారి వారి ఉపాసనల యొక్క పరమార్థమును తెలుసుకొని మంత్ర జప అనుష్ఠానములు, పూజాదికములు చేసుకోవాలి. అలాకాక ఆంతర్యము తెలియక శాస్త్ర పద్ధతులను మూఢులుగా పాటించడం వలన తమ బుద్ధిని, సమయమును వ్యర్థము చేసుకొనుటయే గాని అణుమాత్రము ప్రయోజనము వుండదు.

తత్వమునెరిగిన భక్తి వున్నచో, ఎట్టి ఉపాసకులైనా వారికి దేవతా అనుగ్రహము తప్పక లభిస్తుంది. బాహ్య ఆడంబరములు, ఉపాసనలు అర్థరహితములు, నిష్ప్రయోజనములు. పూర్వం కొందరు భక్తులు 'ఉక్కు స్తంభం మీద ఉగ్రాల నరసింహ' అని భజన చేస్తుండగా, ఒక అమాయకురాలు 'ముక్కుత్తంబం మున ముక్కటాల నరసిమ్ము'డని భజన చేయగా అందరూ నవ్వేవారు. కానీ తత్వం తెలిసినవారు ఆమె భక్తికి తప్పక దైవానుగ్రహం వుంటుందని గ్రహిస్తారు.

నా ఎదురుగా గురువు, భగవంతుడు ఇద్దరూ నిలిచినచో ముందుగా గురువుకే పాదాభివందనం చేస్తాను. ఎందుకంటే, భగవంతుని దర్శించే మార్గము గురువే తెలిపారు. అందుకే భగవానుని కంటే నాకు గురువే ఎక్కువ.

- భక్త కబీర్‌దాస్

భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

ఈ జ్ఞానం ఎన్నోసార్లు ప్రయత్నించిన తరువాత, మళ్ళీ మళ్ళీ శాస్త్రాన్ని సద్గురు దేవుల వద్ద అభ్యసించిన తరువాత కాని కలుగదు. నీ జప, తప ధ్యానాదులు అన్నీ ఈ జ్ఞానం కొరకే కావాలి. నీ జీవితం జ్ఞానమయం కావాలి. అట్టి జీవితం మాత్రమే నిన్ను జనన మరణముల నుండి, దేహేంద్రియాదులపైన అభిమానం నుండి, కోరికల నుండి ముక్తుణ్ణి చేయగలదు. దీనిని సాధించటానికి నీవు ఎంతో జపం చెయ్యవలసి ఉంటుంది. జగత్తు, సంసారం వ్యక్తరూపాలు. కాని వీటికి ఆధారమైన సచ్చిదానందం మాత్రము అవ్యక్తమైనది. నీవు వ్యక్తరూపమైన జగత్తు, లేదా సంసారానికి అతీతుడవు అయినప్పుడు మాత్రమే, ఆత్మానుభూతిని, సచ్చిదాందస్థితిని పొందగలుగుతావు. అంటే నీవు ఇంద్రియాలకు గోచరమయ్యే వాటిని, వికారం పొందేవాటిని అన్నింటిని అధిగమించాలి. అప్పుడుగాని సత్యాన్ని అపరోక్షానుభవంగా సిద్ధించుకోలేవు. దీనిని ఎల్లప్పుడూ గుర్తుంచుకొని విచారపడటం



మాను, నీ మనస్సును ఎటుపడితే అటు, దాని ఇష్టం వచ్చినట్లు కొట్టుకొని పోనీయకు. నీ లక్ష్యాన్ని విడిచిపెట్టకు. నీ స్వధర్మాన్ని కర్తృత్వ భావం లేకుండా ఆచరించు. అది నీ హృదయాన్ని పవిత్రం చేస్తుంది. అప్పుడు నీకు ఆత్మానుభూతి కలుగుతుంది. కాని నీవు స్వధర్మంకాక, దానికి భిన్నమైన ఇతర మార్గాలను ఎన్నుకుంటే మాత్రం నీవు నీ లక్ష్యానికి, లక్ష్యానికి చేర్చే మార్గానికి రెండింటికి దూరం అవుతావు.

26. అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్య సే మృతం
తథాఽపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి॥

శ్రీ కృష్ణ భగవానుడు ఇప్పుడు అర్జునుణ్ణి, ఇతర ఉపాయాలతో, యుక్తులతో సత్యాన్ని తెలుసుకొనేలా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! నీవు దేహమునకు ఆత్మ పరమైనది అని తెలుసుకొనే సామర్థ్యం లేక, ప్రత్యక్ష ప్రమాణం తప్ప వేరే ఏ ఇతర ప్రమాణమును అంగీకరింపక, చార్వాకులవలె దేహమే ఆత్మ అని, అది ఎల్లప్పుడూ, పుట్టుతూ, గిట్టుతూ ఉంటుంది అని అనుకొనే పక్షంలో, అప్పుడు కూడా, నీవు నశించేది అని అనుకొనే ఆత్మకోసం విచారపడటంలో అర్థంలేదు" అన్నాడు.

శ్రీకృష్ణ భగవానుడు ఇంతవరకు ప్రసాదించిన బోధామృతంతో అర్జునుడికి ఆత్మజ్ఞానం కలిగి ఉండవలసింది. కాని అర్జునుడి మనస్సు కలుషితమై, అల్లకల్లోలమై ఉన్నది. అందువలన అర్జునుడికి ఆత్మానుభవం కలగలేదు. ఆ కారణం వలన, వైద్యుడు మందుతోపాటు, అనుపానం కూడా చెప్పినట్లు, ఇచ్చిన మందు బాగా పనిచేయటం కోసం నిద్రమాత్రల వంటివి ఇచ్చినట్లుగా, అర్జునుడికి తాను బోధించినది సరిగ్గా గ్రహించటానికి కావలసిన మనశ్శాంతిని ప్రసాదించటానికై, శ్రీకృష్ణ భగవానుడు, ఇంతకుముందు చెప్పిన వాటికంటె కొన్నిమెట్లు క్రింద ఉండే ఉపాయాలను, యుక్తులను ఉపయోగిస్తున్నాడు.

- సశేషం

హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును.....

నవంబర్ 2026

4 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

7 శని: నరకచతుర్దశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 ఆది: దీపావళి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 శుక్ర: నాగుల చవితి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 శుక్ర: చిలుక ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

21 శని: క్షీరాబ్ధి ద్వాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 మంగళ: (కార్తీక)–గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

27 శుక్ర: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం.

డిసెంబర్ 2026

3 గురు: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 మంగళ: మార్గశిర శుద్ధ షష్టి – సుబ్రహ్మణ్య షష్టి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 బుధ: ధనుర్మాస వ్రత ప్రారంభం

20 ఆది: మార్గశిర శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 గురు: మార్గశిర పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

దైవ సంకల్పం

సేకరణ - బి. లక్ష్మీ లలితా కుమారి

మన జీవితాన్ని, ప్రపంచగమనాన్ని మనం జాగ్రత్తగా గమనిస్తే మనం అనుకొన్నట్టు కాక దైవ సంకల్పం ప్రకారమే అంతా జరుగుతున్నట్టు మనకు సులభంగానే అర్థమవుతుంది. 'అంతా దైవసంకల్పం ప్రకారమే జరుగుతుంది, కాబట్టి నేను ఏమీ చేయకుండా సోమరిగా కూర్చుంటాను' అనటమూ తప్పే. మన ప్రయత్నం మనం చేయవలసిందే. మనం అనుకొన్నట్టు జరక్కపోతే నిరుత్సాహపడటం, నిస్పృహకు లోనుకావటం, ఆత్మహత్యలకు పాల్పడటం తగదు.

ఇక కొంతమంది సాధు పురుషులు దైవ సంకల్పంలో వారి సంకల్పాన్ని ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ఎలా విలీనం చేస్తారో తెలిస్తే ఆశ్చర్యం కలుగకమానదు. స్వామి రామసుఖదాస్ 'ఒకటి సాధిస్తే అన్నీ సాధించినట్లే' అనే తమ గ్రంధంలో ఒక కథ చెబుతారు.

ఒక స్వామీజీ ఉన్నారు, ఒక రోజు పడవలో ఎక్కడికో వెళుతున్నారు. ఆయనతో బాటు ఆ పడవలో చాలామంది జనులున్నారు. పడవ ప్రవాహమధ్యానికి చేరింది. ప్రవాహవేగానికి ఒక దిక్కుగా కొట్టుకుపోవడం మొదలుపెట్టింది, అప్పుడు.. 'అయ్యలారా.. మీమీ ఇష్ట దైవాలను స్మరించుకోండి, పడవ అదుపు తప్పింది, ముందు సుడిగుండం కూడా ఉంది, బహుశా మునిగిపోవచ్చు' అని పడవవాడు హెచ్చరించాడు. ఇంతలోనే పడవలోకి కొంతనీరు వచ్చి చేరింది, అందరూ ఏడవడం ప్రారంభించారు. స్వామీజీ మాత్రం 'జయజయరాం జయసీతారాం' అంటూ పాడుతూ తమ వద్దనున్న కమండలంతో ఇంకొన్ని నీళ్ళు తీసుకొని పడవలోకే వేయడం చేశారు. అందరికీ ఆశ్చర్యంతో పాటు భయం వేసింది. పడవలోని నీటిని తీసి నదిలోకి వేసే బదులు నదిలోని నీటిని మునిగిపోతున్న పడవలోకి వేసి ఇంకా త్వరగా పడవ మునిగిపోయేట్టు చేస్తున్నాడు ఈ పిచ్చి సాధువు అనుకొన్నారు.

కొంత సేపటికి పడవ ప్రమాదస్థలాన్ని దాటి బయటపడింది, అదుపులోకి వచ్చింది. పడవవాడు, ఇతరులు ఊపిరిపీల్చు కొన్నారు, గండం గడిచింది అన్నాడు ఆ పడవవాడు. ఇప్పుడు సాధువు మళ్ళీ 'జయజయరాం, జయసీతారం' అని పాడుతూ తన కమండలంతో పడవలోని నీటిని తోడి నదిలోకి వేశారు.

అక్కడున్నవారు ఆశ్చర్యపడి 'నీకు పిచ్చిపట్టిందా? నదిలోని నీరు పడవలోకి వేశావు, ఇప్పుడు పడవ ప్రమాదం నుంచి బయటపడితే పడవలోని నీటిని బయటికి

వేస్తున్నావు. ఏమిటీ ఇదంతా?' అని అడిగారు. అప్పుడు ఆ సాధువు చాలా ప్రశాంతంగా వారితో 'ఇందులో వింత ఏముంది? పడవ మునిగిపోతున్నప్పుడు పడవను ముంచటం దైవ సంకల్పం అని భావించాను, ఆ సంకల్పంతో నా సంకల్పాన్ని లీనం చేశాను. ఆ సంకల్పం త్వరగా నెరవేరటానికి నా వంతు కృషి నేను చేశాను.

మళ్ళీ పడవ ప్రమాదం నుంచి బయటపడటంతో పడవను నదిలో ముంచటం కాక, రక్షించటం దైవ సంకల్పం అని తెలుసుకొని పడవలోని నీటిని తోడి బయట పడేశాను, దైవ సంకల్పం నెరవేరటానికి నా వంతు కృషి నేను చేశాను. అంతే!' అని, కళ్ళు మూసుకొన్నారు.

ఆ సాధువు పడవ మునిగి పోతున్నప్పుడు అందరిలాగా భయాందోళనలకు గురికాక దేవుడిని స్మరించారు. పడవ ప్రమాదం నుంచి బయట పడినప్పుడు అందరిలాగా సంతోషంతో గంతులు వేయక ప్రశాంతంగా దైవ స్మరణలో నిమగ్నమయ్యారు.

మరణాన్ని, జీవితాన్ని రెంటినీ దైవస్మరణతో స్వీకరించారు. మనం అంతటి ఉన్నతులం కాకపోవచ్చు. కష్టనష్టాల నుంచి బయట పడటానికి శాయశక్తులా కృషి చేద్దాం. దైవంపై భారం వేసి వాటిని ఎదర్కొందాం!!

మనస్సు ప్రాపంచిక విషయాదులలో
సంచరించడమే సంసార బంధం.
మనస్సు ఆత్మయందు నిశ్చలత పొందడమే భవ
బంధ రహితమగు మోక్షము.

- శ్రీ కాళీబాబు

4) ఎవరు ఈ లోకాన్ని విడిచి పెట్టేముందు ఓంకార నాదం వినిపించింది?
5) గౌణభక్తికి ముఖ్యభక్తికి తేడా ఏమిటి?
6) మూర్ఖుడు పండితుడిని ఎలా ఓడించాడు?

శ్రీనాథ్‌జీ

సేకరణ - మురళి

గోలోక ధామంలో మణిరత్నాలతో అలంకరించబడిన శ్రీ గోవర్ధన పర్వతం ఉంది. అక్కడ గిరిరాజ్ గుహలో శ్రీ గోవర్ధననాథుడు, శ్రీ స్వామినిజీ మరియు వ్రజ భక్తులతో కలిసి నిత్య రసమయ లీలలు చేస్తుండేవారు. అక్కడ ఆచార్యులు శ్రీ వల్లభాచార్యులు నిరంతరం శ్రీ గోవర్ధన నాథుని సేవ చేస్తుండేవారు. ఒకసారి శ్రీ గోవర్ధననాథుడు, వల్లభాచార్యులను పృథ్వీలో అవతరించి, భక్తులను ఉద్ధరించమని ఆజ్ఞాపించారు. శ్రీ గోవర్ధననాథుడు, శ్రీ స్వామినిజితో పాటు వ్రజ భక్తులు, లీలాసామగ్రితో కలసి భూమిపై స్వయంగా అవతరించనున్నానని హామీ ఇచ్చారు. ఈ హామీ ప్రకారం, విక్రమ సంవత్సర 1466, శ్రావణ కృష్ణ తృతీయ, ఆదివారం ఉదయం సూర్యోదయ సమయానికి శ్రీ గోవర్ధన నాథుని అవతరణ గోవర్ధన పర్వతంపై జరిగింది. ఈ అవతరణ శ్రీకృష్ణుడు ఇంద్రుడి గర్వభంగం కోసం వ్రజ వాసుల చేత పూజింపబడిన రూపమే.

1466వ సం. శ్రావణ శుద్ధ పంచమి (నాగపంచమి), నాడు ఒక వ్రజ వాసి తను కోల్పోయిన ఆవును వెతుకుతూ గోవర్ధన పర్వతానికి వెళ్ళాడు. అక్కడ అతడికి శ్రీ గోవర్ధననాథుని ఎత్తిన ఎడమ భుజం దర్శనమైంది. తరువాత గ్రామస్తులు కూడా ఆ భుజాన్ని చూశారు. ఒక వృద్ధ వ్రజవాసి చెప్పాడు – ఇది శ్రీకృష్ణుడు ఇంద్రుడి కోపం నుండి వ్రజాన్ని రక్షించినప్పుడు ఎత్తిన భుజమే. అందుకే ఆ భుజాన్ని పూజించారు. 69 సంవత్సరాలు వ్రజ వాసులు ఆ ఎడమ భుజాన్ని మాత్రమే పూజించారు, దానికి పాలు పట్టారు, భోగం సమర్పించారు. ప్రతి సంవత్సరం నాగపంచమి రోజున అక్కడ మేళా జరిపారు.

శ్రీనాథజీ ముఖ దర్శనం – విక్రమ సంవత్సర 1535, వైశాఖ బహుళ ఏకాదశి రోజున ఒక అద్భుత సంఘటన జరిగింది. ఆన్యోర్ గ్రామవాసి సద్దూ పాండేకు చెందిన "ధూమర్" అనే ఆవు ప్రతి రోజు శ్రీనాథజీ ఎడమ భుజం వున్న స్థలానికి వెళ్ళి అక్కడ తన పొదుగులో నుండి పాలు కార్చి వస్తుండేది. ఒకరోజు సద్దూ పాండే తనే వెళ్ళి చూసినప్పుడు ఆవు పాలు కార్చే స్థలంలో శ్రీనాథజీ ముఖం దర్శనమయ్యింది. అదే రోజున చత్తీస్‌గఢ్ చంపారణ్యంలో శ్రీ వల్లభాచార్యులు జన్మించారు. శ్రీ గోవర్ధననాథుడు స్వయంగా సద్దూ పాండేకి తన పేర్లు "దేవదమన", "ఇంద్రదమన", "నాగదమన" అని చెప్పారు. అప్పటి నుండి వ్రజవాసులు ఆయనను దేవదమనగా పిలవసాగారు. సద్దూ పాండే భార్య భవాని మరియు కుమార్తె నరోన్ ప్రతిరోజూ ఆవు పాలను సమర్పించేవారు.

వల్లభాచార్యుల దర్శనం మరియు ఆలయ నిర్మాణం -1549వ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి గురువారం రోజు శ్రీనాథజీ వల్లభాచార్యులకు దర్శనమిచ్చి, మీరు గోవర్ధనానికి వచ్చి మా సంపూర్ణ స్వరూప దర్శనం ఏర్పాటుచేయాలని ఆజ్ఞాపించారు. శ్రీ వల్లభాచార్యులు వ్రజ్‌కు వచ్చి ఆన్యోర్ గ్రామంలో సద్దూ పాండేని కలిశారు. గోవర్ధన పర్వతానికిచేరి శ్రీనాథజీ దర్శనానికి వెళ్ళగా, తూర్పునుండి శ్రీనాథజీ స్వయంగా ప్రకటితమైన దృశ్యాన్ని చూచి ఆనందాశ్రువులు కార్చారు. వారివురు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. "ఇక్కడ నా మందిరాన్ని నిర్మించి, సేవను ప్రారంభించు" అని శ్రీనాథజీ వారిని ఆజ్ఞాపించారు. వెంటనే వల్లభాచార్యులు చిన్న కుటీరం నిర్మించి శ్రీనాథజీకి మకుటం, గజమాలలతో అలంకరించి ప్రతిష్ఠించారు.

ఆలయ అభివృద్ధి: తర్వాత, వల్లభాచార్యుల అనుమతితో పూర్ణమల్ల ఖత్రి పెద్ద మందిరాన్ని నిర్మించారు. విక్రమ సం. 1576, వైశాఖ శుక్ల తృతీయ (అక్షయ తృతీయ) రోజున శ్రీనాథజీ కొత్త మందిరానికి వేంచేశారు. మధ్వేంద్ర పూరి మరియు బెంగాలీ బ్రాహ్మణులు సేవలో నియమించబడ్డారు. కుంబనదాస్ సంగీత సేవ ప్రారంభించి, కృష్ణదాస్‌కు అధికారాన్ని ఇచ్చారు. తర్వాత వల్లభ సంప్రదాయ ప్రతినిధి శ్రీ గుసాయింజీ బెంగాలీ పూజారులను తొలగించి, కొత్త సేవా విధానం ప్రవేశపెట్టారు.

- సశేషం

సమర్థ సద్గురు మాసపత్రిక వారి విన్నపము

ఉదార దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక తెలుగు రాష్ట్రాలలోని అనేక గ్రంథాలయాలకు చేరుతూ, అనేక మంది పాఠకులకు జ్ఞానసేవ అందిస్తోంది. ఈ గ్రంథాలయ చందాలలో చాలావాటి గడువు త్వరలో ముగియనున్నందున, ఈ సేవ నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, పాఠకులు విరాళాలతో ముందుకు రావలసిందిగా మనవి.

అలాగే, పుట్టినరోజులు, వివాహాలు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు వంటి శుభ సందర్భాలలో మీ బంధుమిత్రులకు బహుమతి చందాలు (Gift Subscriptions) అందించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచండి.

మీ సహకారం అనేక మంది పాఠకులకు జ్ఞానదీపంగా నిలుస్తుంది. ఈ సేవకు సంబంధించిన వివరాల కోసం: 8333808310.

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

189. ఓం గర్వఘ్నాయ నమఃః

లోకంలో తమ బలాన్ని, యవ్వనాన్ని, సంపదను, బలగాన్ని చూసుకొని అహంకరించి గర్విష్ములైన మానవుల యొక్క గర్వాన్ని తొలగించి, వారికి తమకు ఇవన్నీ ప్రసాదించి తమను నడిపిస్తున్న దైవం అనబడే ఒక మహా శక్తి ఉన్నదని, ఆ శక్తి యొక్క సహకారం లేనిదే తాము ఎందుకూ పనికి రామనే జ్ఞానాన్ని కలిగించి, వారిని అహంకార రహితులుగా చేసి ముక్తిని ప్రసాదించగల సమర్థులు శ్రీగురుదేవులు.

190. ఓం గానలోలుపాయ నమఃః

శ్రీగురుదేవులకు గానమనిన అమితమైన ఇష్టము. సంగీతంలో ఎంతో సాధన చేసి వివిధ రాగాలపై పట్టు సాధించి ఆలపించే గానం కన్నా భక్తితో స్వామికి ఆత్మ నివేదన గావించుకొనే ప్రార్థనా పూర్వకమైన గానమే వారిని రంజింప చేయగలదు.

191. ఓం పూర్వాపర విశేషజ్ఞాయ నమఃః

శ్రీ గురుదేవులు ఈ సృష్టికి పూర్వమే ఉన్నవారు. అలాగే ఈ సృష్టి అంతమైన తరువాత కూడా ఉండే శాశ్వతులు. కనుక వారికి తెలియనిది లేదు. మనకు జన్మ జన్మల నుండి జరిగిన, జరుగుతున్న, రాబోయే జన్మలలో జరగబోయే అన్ని విషయాలు వారికి తెలుసు. మనము యేయే పూర్వ కర్మలు చేయుట వలన ఇలా ఉన్నామో ఇక ఏ కర్మలు చేయటంద్వారా ఉన్నత స్థితిని పొందగలమో వారికి తెలుసు. మన మనస్సునందు ఒక ఆలోచన వచ్చినదంటే అది ఆరు నెలలు ముందుగానే వారికి తెలుస్తుందని వారే చెప్పేవారు. అట్లా తెలుసుకొని మనను దురాలోచన నుండి రక్షించి సన్మార్గములో పెట్టటానికి వారు ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకొంటారు.

192. ఓం నిర్వాణ సుఖదాయకాయ నమఃః

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యుల మనసులలోని సకల సంకల్పాలను, వాసనలను పోగొట్టి, వాటిని శుద్ధ మనస్సులుగా చేసి, వారికి పరిపూర్ణమైన ఆత్మానందాన్ని, పరమ శాంతిని ప్రసాదించి శాశ్వతమైన మోక్షసామ్రాజ్యాన్ని ప్రసాదించగల సమర్థులు.

193. ఓం అమూల్య జ్ఞాన సంపన్నాయ నమఃః

శ్రీగురుదేవులు అమూల్యమైన జ్ఞాన సంపన్నులు. వారియొక్క పరిపూర్ణ జ్ఞానము

వెలకట్టలేనిది, అనంతమైనది. మనము ఈ లోకంలో ఏవో కొన్ని విషయాలను మాత్రమే తెలుసుకోగలం. కానీ ఈ ప్రాపంచిక జ్ఞానమంతా నిజానికి అజ్ఞానమే. సత్య వస్తువైన పరమాత్మను గూర్చిన జ్ఞానమే నిత్యమైనది. అమూల్యమైనది.

194. ఓం సమూలాగమ పారగాయ నమః

శ్రీగురుదేవులు వేదాలయొక్క మొదలు చివర కూడా తెలిసినవారు. అనగా క్షుణ్ణంగా తెలిసినవారు. ఏది తెలుసుకొంటే ఇక వేరేదీ తెలుసు కొనవలసిన అవసరం ఉండదో అదే వేదమంటే. అట్టి వేదాలు ఏ పరమాత్మ వస్తువునైతే కీర్తిస్తున్నాయో ఆ పరమాత్మ వస్తువే శ్రీగురుదేవులు. వేదాలకు కర్త, అధినేత కూడా వారే. అట్టి సర్వజ్ఞులైన శ్రీగురుదేవులకు నమస్కరిస్తున్నాను.

195. ఓం సమూర్జిత పరంజ్యోతిషే నమః

శ్రీగురుదేవులు సర్వ శక్తివంతమైన పరంజ్యోతి స్వరూపులు. ఈ లోకానికంతటికీ శక్తినిచ్చే శక్తి కేంద్రమైన ఆ సూర్యభగవానునికి కూడా శక్తినిచ్చి ప్రకాశింపచేసే ఏ పరంజ్యోతి అయిన పరమాత్మ శక్తి అయితే ఉన్నదో అట్టి పరమాత్మ శక్తియే శ్రీగురుదేవులు. వారి ప్రకాశం ముందు కోటి సూర్యుల కాంతి కూడా వెలవెలబోతుంది. అట్టి పరంజ్యోతి స్వరూపులను కేవలం జ్ఞాన నేత్రముల ద్వారా మాత్రమే చూడగలం.

196. ఓం విమూఢ జన భీషణాయ నమః

అనేక జన్మలనుండి వస్తున్న వాసనల ప్రభావం చేత ప్రాపంచిక విషయలోలులై పరమార్థ సాధన విషయంలో కర్తవ్యతా విమూఢులైన జనులకు కఠోర నిర్దేశకులై వారికి వారి ప్రస్తుత స్థితిలోని భయంకర పరిణామాలను ఎఱుకపరచి, వారిని కర్తవ్యోన్ముఖులను చేసి తరింపచేయగల సమర్థ సద్గురు దేవులకు నమస్కరించుచున్నాను.

197. ఓం లోకత్రయ సుసంసేవ్యాయ నమః

ఈ మూడు లోకముల వారి చేత భక్తితో సేవింపబడు అద్వైత సామ్రాజ్య చక్రవర్తి శ్రీగురుదేవులు. ఈ మూడు లోకములలో నున్న జనులందరు మూడు గుణములలో ఏదో ఒక గుణమునకు లోబడి ఉందురు. కానీ శ్రీగురుదేవులు ఈ త్రిగుణములకు అతీతులై గుణరహితులై ప్రకాశించుచున్నారు. నిజానికి ఈ సకల జనులు ఆయననుండే ఉద్భవించినా ఈ గుణత్రయానికి బానిసలై సంసారములో బంధించబడి అనేక కష్టాలు అనుభవిస్తూ ఉన్నారు. అట్టి జీవులకు విముక్తి కలగాలంటే వీటికి అతీతులై గుణరహితులైన శ్రీగురుదేవులను భక్తి ప్రపత్తులతో సేవించి తరించవలసినదే.

- సశేషం

శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి) - కే.శే. రమణ ప్రసాద్

ఇంతలో అకస్మాత్తుగా వసుదేవుని పెదవుల కదలిక ఆగిపోయింది. అదేక్షణంలో అక్కడ ఆ విశాలఖండంలో ఏకత్రితమైన జనం అందరూ మేఘగర్జనలా గంభీరంగా వెలువడిన ఓంకార నాదాన్ని విన్నారు. ఎక్కడినుండి వచ్చింది ఆ ధ్వని? అందరూ అటూ, ఇటూ చూశారు. ఒకరివైపు ఇంకొకరు చూసుకొన్నారు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.



ఇంతలో మళ్ళీ అదే ఓంకారనాదం తిరిగి వినిపించింది. ఈసారి అందరూ వసుదేవుని వైపు చూశారు. అసంఖ్యాకమైన జనులు చూస్తున్నప్పుడు అతని నుండి ఆ ఓంకారధ్వని వినిపించింది. అందరూ ఆశ్చర్య చకితులై చూస్తున్నారు. వసుదేవుని రోమ రోమాల నుంచీ ఓంకారనాదం మేఘగంభీర నాదంతో వెలువడుతోంది. ఏక కాలంలో సహస్ర కంఠాలు ఉచ్చైస్వరంతో ఓంకారం చేస్తున్నట్లుగా, ఓంకారనాదంతో అక్కడి వాతావరణం అంతా నిండిపోయింది.

అంతే! ఉన్నట్లుండి అంతా స్తబ్ధుగా అయిపోయింది. ఆ ఓంకారనాదం నెమ్మదిగా తనలో తాను లీనమై మళ్ళీ అక్కడ ఒక గంభీరమైన ప్రశాంత నిశ్శబ్దం నెలకొన్నది. కట్టెలా బిగిసిన వసుదేవుని శరీరం దేవకి భుజాలపైన వాలిపోయింది. అందరూ దిమ్మెరపోయారు... అప్రయత్నంగా అందరూ ఏకకంఠంతో బిగ్గరగా ఓంకారనాదం చేశారు. ఆ గంభీర ప్రణవనాదం గాలిలో సుళ్ళుతిరుగుతూ ఆకాశం అంతా ప్రతిధ్వనించింది.

మంత్రముగ్ధుల వలె అయిన పురజనులందరికంటె ముందుగా అర్జునుడు ప్రస్తుతంలోకి వచ్చాడు. తన భుజాలపైన పడిన తన పతి నిశ్చేష్టితమైన దేహాన్ని సైతం గుర్తించని దేవకిలో ఏ చలనమూ లేదు. అర్జునుడు మెల్లగా ఆమెను సమీపించాడు. మెల్లగా ఆమె చేతులు వణుకుతున్నట్లు అనిపించింది. ఆమె ఏమైనా చేయగలిగే స్థితిలో

వుంటేగా! అసలు ఈ లోకంలోనే ఉన్నట్లు లేదు. అర్జునుడు వసుదేవుని శరీరాన్ని భూమిపైన పడుకోబెట్టాడు.

అప్పటికి జనం అంతా అక్కడ ప్రోగయ్యారు. నగరవాసులంతా మహల్‌లోను, ఉద్యానవనంలోను, రాజమార్గాలలోను క్రిక్కిరిసిపోయారు. అర్జునుడు ఆ జనసందోహంవైపు చూశాడు. వారందరూ నిర్విణ్ణులై ఏమి జరుగుతుందా అని చూస్తున్నారు.

అంతమంది జనం ఉన్నా, ఆ సమయంలో వసుదేవుని పార్థివ శరీరాన్ని భుజాలపై ఎత్తుకొని, శ్మశానానికి తీసుకువెళ్ళటానికి నలుగురు యాదవులు కఱవైనారు. సమస్త వృష్ణివంశం నష్టమయిపోయింది కదా! కృష్ణ, బలరాములవంటి ప్రఖ్యాత పుత్రులనుగన్న ఆ తండ్రికి అగ్ని సంస్కారం చేయటానికి అతని కులంలో ఎవ్వరూ మిగల్లేదు. ఒక్క అనిరుద్ధుని పుత్రుడు తప్ప. ఆ బాలకుణ్ణి తీసికొని అర్జునుడు వసుదేవుని అంతిమ యాత్రకు బయలుదేరాడు.

సూర్యుని కోమల కిరణాలు భూమిపై ప్రసరిస్తున్నాయి. ఆ కిరణాల సాక్షిగా అగ్ని వసుదేవుని పార్థివ శరీరాన్ని పంచభూతాలలో విలీనం చేసింది. ఆ పంచభూతాలే వపుదేవునితోపాటు దేవకీమాతను కూడా తమలో విలీనం చేసుకొన్నాయి. అగ్నిసాక్షిగా దేవకీమాత సతి ధర్మం నిర్వహించింది. ప్రజలు దుఃఖోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. గాలికి కూడా వారి కంటితడిని తుడవటం ఇష్టం లేకపోయింది. సూర్యకిరణాలు తమను తాము హెచ్చరించుకుంటూ ముందుకు సాగిపోయాయి.

అర్జునుడు చెయ్యవలసినదంతా చేశాడు. అన్ని విధులూ నిర్వహించాడు. మఱి తానొక్కడే కదా అక్కడ ఉన్నది! అంతా అయ్యాక అర్జునుడు దారుకుని పిలిచి 'దారుకా! రాజ్యపాలనా నిర్వహణ పరంపరలో భంగం వాటిల్లకూడదు కదా! అందుకు ద్వారక సింహాసనం పైన యాదవకులానికి ఏకమాత్ర వారసుడైన....'

"క్షమించండి కౌంతేయా!" దారుకుడు మధ్యలోనే కలిగించుకుంటూ అన్నాడు "ద్వారక శాసనం మీరే చేయాలని తండ్రి వసుదేవుని కోరిక. కృష్ణుని ఆజ్ఞానుసారం నేను హస్తినాపురానికి వచ్చేముందు వసుదేవుడే స్వయంగా తన ఇచ్ఛను నాతో ప్రకటితం చేశాడు."

- సశేషం

నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

నారద భక్తి సూత్రం -- 67 **భక్తా ఏకాంతినో ముఖ్యాః** ॥

తాత్పర్యం: అనన్యంగా, ఏకనిష్ఠతో భగవంతునినే ఆశ్రయించిన భక్తులే ముఖ్యభక్తులు.



ఇంతవరకు నారద మహర్షి ప్రధానంగా భక్తి అంటే ఏమిటి, భక్తి ఎలా లభిస్తుంది, భక్తికి అడ్డంకులు ఏమిటి, గౌణభక్తి ఎలా ఉంటుంది, సాధకుడు తన కామక్రోధాభిమానాలను ఎలా భగవంతుని వైపు మళ్ళించాలి, ప్రేమభక్తి ఎలా వికసించాలి అనే సాధనాక్రమాన్ని వివరించారు.

ఇలా ఈ సూత్రంతో ప్రారంభమయ్యే పంచమ అధ్యాయంతో నారదులు పరిపక్వమైన ముఖ్య భక్తుని మహిమని వర్ణిస్తున్నారు.

భగవంతుని ద్వారా మరేదైనా పొందాలని కాకుండా, భగవంతుడినే పరమప్రాప్తిగా భావించి, ఆయనపైనే అనన్యమైన, స్వార్థరహితమైన ప్రేమ కలిగిన భక్తులే ముఖ్యభక్తులు అన్నది ఈ సూత్రము యొక్క సారాంశం.

ఏకాంతినః అంటే ఒకే లక్ష్యం కలిగినవారు; **అనన్యులు;** మరొక ఆశ్రయం లేనివారు; భగవంతుడినే పరమాశ్రయంగా, పరమగమ్యంగా భావించేవారు. ఏకాంతం అంటే ఇక్కడ ఒంటరిగా ఉండడం కాదు. మనస్సులో భగవంతునికి ప్రత్యామ్నాయం లేకపోవడం. **ముఖ్యాః** అంటూ గౌణభక్తికి భిన్నమైన ముఖ్యభక్తి, అంటే స్వార్థరహితమైన, అనన్యమైన పరాభక్తిని నారదులు సూచిస్తున్నారు.

ఇంతకు ముందు సూత్రాలలో వివరించబడిన గౌణభక్తిలో సత్త్వ, రజస్తమో గుణాల ప్రభావం ఉండవచ్చు; ఆర్తి, అర్థార్థిత్వం, జిజ్ఞాస వంటి వ్యక్తిగత ప్రేరణలు వుండవచ్చు. కానీ ముఖ్యభక్తిలో భగవంతుడు మరొక ఫలాన్ని పొందడానికి సాధనం కాదు. వారికి కేవలం భగవంతుడే ప్రాప్తి; భగవంతుడే పరమగమ్యం.

ఏకాంతభక్తి అంటే అన్నింటిలోనూ భగవంతునితో ఉన్న సంబంధాన్ని చూడడం. ఆ భక్తి కలిగిన వారు తన కుటుంబాన్ని భగవదర్పితమైన ప్రసాదముగా భావిస్తారు. కర్తవ్యాన్ని కర్తృత్వాభిమానంతో కాకుండా సేవగా చేస్తారు. ప్రేమకు మూలంగా భగవంతుడినే దర్శిస్తారు.

'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే' అంటూ భగవంతుడినే అనన్యంగా చింతిస్తూ, నిరంతరం ఆయనను ఉపాసించే భక్తుల యోగక్షేమాన్ని

భగవంతుడే వహిస్తాడని భగవద్గీత సెలవిచ్చిన **"అనన్య"** అనే పదానికి, నారదుని **"ఏకాంతినః"** అనే పదానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. రెండింటిలోనూ హృదయానికి రెండవ పరమాశ్రయం లేకపోవడమే ప్రధాన భావం.

కానీ ముఖ్యభక్తిలో ఒక పరివర్తన జరుగుతుంది. మొదట భగవంతుడు తన కోరికను తీర్చేవాడు. తరువాత భగవంతుడు తనకు తెలుసుకోవలసిన తత్వం. చివరకు భగవంతుడే తాను కోరుకునే పరమప్రాప్తి అవుతాడు.

శ్రీమద్భాగవతం

న పారమేష్ఠ్యం న మహేంద్రధిష్ణ్యం
న సార్వభౌమం న రసాధిపత్యమ్ ।
న యోగసిద్ధీరపునర్భవం వా
మయ్యర్పితాత్మేచ్ఛతి మద్వినాన్యత్ ॥

అని వివరిస్తూ తన ఆత్మను భగవంతునికి అర్పించిన భక్తుడు బ్రహ్మపదవిని, ఇంద్రపదవిని, భూమండలాధిపత్యాన్ని, ఇతర లోకాల ఆధిపత్యాన్ని, యోగసిద్ధులను, పునర్జన్మరహిత మోక్షాన్ని కూడా భగవంతునికంటే వేరుగా కోరడని తెలియజేస్తుంది. ఇదే **"ఏకాంతినః"** అనే ఒక్క పదానికి అత్యంత అందమైన వివరణ.

ఇక్కడ నారదుడు గౌణభక్తిని నిరాకరించడం లేదు. గౌణభక్తి కూడా భగవంతుని వైపు ప్రయాణమే. కానీ దానికి ఇంకా ఏదో ఒక కారణం, గుణప్రభావం లేదా ఫలాపేక్ష ఉండవచ్చు. ముఖ్యభక్తిలో భక్తియే ఫలం, ప్రేమయే ఫలం, భగవంతుడే ఫలం. ఏకాంతభక్తుడు ప్రపంచాన్ని విడిచిపెట్టినవాడు కాదు; ప్రపంచం మధ్యలో వున్నప్పటికీ తన హృదయానికి భగవంతుని తప్ప మరొక పరమాశ్రయం లేనివాడు. అతడు భగవంతుణ్ణి ఏ కోరికతోనో ప్రేమించడు; చివరకు మోక్షాన్ని పొందడానికి కూడా భగవంతుణ్ణి ఒక సాధనంగా చూడడు. భగవంతుడే అతని సాధనం మరియు సాధ్యం. **"ముఖ్యభక్తి"** అంటే భగవంతుని ద్వారా ఏదో పొందడం కాదు --- భగవంతుడినే పొందడం. ఇదే ఈ సూత్రం ద్వారా నారదులు అందచేస్తున్న పరమ సత్యం.

- సశేషం

7) మమకారముతో అహంకారము ఎందుకు కూడి ఉంటుంది?
8) మైనాకుని తల్లి ఎవరు?
9) కర్ణుడు ఎడమచేతితో ఎందుకు దానం చేశాడు?

వాదన

– కే.శే.వెంకట రమణ ప్రసాద్

ఒక ముద్రా పండితుడు సవాలు చేశాడు. ఆస్థానంలో ఒక ఏకాక్షి మూర్ఖుడికి పండితుడి వేషం వేసి పోటీకి నిలిపారు.

పండితుడు ఒక చూపుడు వేలు చూపాడు.

ఏకాక్షి రెండు వేళ్ళు చూపాడు.

పండితుడు మూడు వేళ్ళు చూపాడు.

ఏకాక్షి ముష్టి (పిడికిలి) బిగించాడు.

పండితుడు ఓడిపోయానని ఒప్పుకుని వెను తిరిగి వెళ్ళిపోయాడు.

"ఎందుకు ఓడిపోయావు?" అని అందరూ అడిగితే దానికి సమాధానంగా పండితుడు ఇలా చెప్పాడు.

"నేను భగవంతుడు ఒక్కడే అని ఒక వేలు చూపాను. కాదు జీవాత్మ పరమాత్మలు రెండు అని ఆయన రెండు వేళ్ళు చూపాడు. నేను ప్రకృతిని కలిపి మూడు అని మూడు వేళ్ళు చూపాను. దానికి ఆయన మొత్తం ఒకటిలో అంతర్భాగాలే అని పిడికిలి బిగించి చూపాడు. ఆయనలో ఉన్న గొప్పతనం నాకు తెలిసింది. అందుకే నేను నా ఓటమిని అంగీకరించాను" అన్నాడు ఆ పండితోత్తముడు.

"పండితుణ్ణి నువ్వు ఎలా ఓడించగలిగావు?" అని ఏకాక్షి (మూర్ఖుణ్ణి) అందరూ అడిగితే, దానికి ఏకాక్షి ఇలా చెప్పాడు.

"ఆయన ఒక వేలు చూపించి, నీకు ఒంటి కన్నే అని ఎగతాళి చేశాడు. నేను నాది ఒక కన్నే అయినా, నీ రెండుకళ్ళతో సమానము అని రెండువేళ్ళు చూపించాను.

ఆయన మనిద్దరివి కలిపి మూడు కళ్ళు అని హేళనగా మూడువేళ్ళు చూపించాడు. నాకు ఒళ్ళు మండిపోయి మూతిమీద గుద్దుతాను నిన్ను అని పిడికిలి బిగించి చూపాను. దానితో భయపడి వెనక్కి వెళ్ళిపోయాడు. అంతే!" అన్నాడు మూర్ఖ ఏకాక్షి.

ఒకళ్ళ మాటలు ఒకళ్ళకి అర్థం కాని వాదనలు ఇలాగే ఉంటాయి.

స్థిత ప్రజ్ఞుడు - కీ.శే. పరాశర ప్రసాద్

సాధనలో కూర్మ ప్రమాణము అనుకూలమైనది. కూర్మము పరుగులు పెట్టదు. ఎదుర్కొనదు. సహనం కావాలి. రాగద్వేషాలతో కూడిన దృష్టి ఉండకూడదు. నిరాహారం చేసినంత మాత్రాన, ఇంద్రియాలను నిగ్రహించినంత మాత్రాన స్థితప్రజ్ఞుడు కాజాలడు. మనస్సు వాసనారహితం కావాలి. బలవంతంగా కోర్కెలను చంపుకున్నంత మాత్రాన సంకల్పం సమసిపోదు. అది బీజరూపంలో ఉండి సమయం వచ్చినప్పుడు అంకురిస్తుంది.

జ్ఞానేంద్రియాలతో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే ఆహారం తీసుకోకపోతే వాసన పోతుంది. ఇంద్రియాలు బలవత్తరమైనవి. అవి మనస్సుని తస్కరిస్తాయి. అంతిమ శ్వాస విడిచేవరకు మాయ నీ వెంట పడక తప్పదు సుమా!

శరీరానికి వయస్సు ఉందికాని, ఇంద్రియాలకు వయస్సుతో నిమిత్తం లేదు. ఒకడికి ములక్కాడ అంటే ఇష్టం. కానీ అతడు కాశీలో గంగలో ములక్కాడని వదిలి పెట్టాడు. తినటం మానేశాడు. ఒకనాడు స్నేహితుడి యింటికి వెళ్ళాడు. ఆరోజు మార్కెట్ బంద్. స్నేహితుడి ఇంట్లో, కూర, సాంబార్ అన్నీ దొడ్లోని ములక్కాడలతో చేశారు. తీరా భోజనం చేసే సమయం ఆసన్నమైంది. ములక్కాడ కాశీలో వదిలేసిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఎలాగా అని ఆలోచించాడు. మనస్సు ప్రబోధన చేసింది. కాశీలో వదిలినది పచ్చి ములక్కాడ కదా! ఉడికినది కాదు కదా ఫరవాలేదులే! అని. చూశారా అదే వాసన! అది తొలగనంత వరకు మానవుడు మనసుకు దాస్యం చేయవలసినదే.

శరీరమనే రథానికి ఇంద్రియాలు గుఱ్ఱాలు. రథసారథిగా బుద్ధి ఉంటే గుఱ్ఱాలు అదుపులో ఉంటాయి. అంతేకాని మనస్సు రథసారథి అయితే గుఱ్ఱాలు అదుపు తప్పి, జీవుడు గమ్యాన్ని చేరుకోలేడు.

జ్ఞాన యజ్ఞం గొప్పది. దానికి శ్రద్ధ కావాలి. ధనం అవసరం లేదు. దానికి బోధ హవిస్సు. సామాన్య మానవుడు తినటం, త్రాగటం, నిద్రించటం మొదలగు ప్రక్రియల యందు ఆసక్తి కలిగి ఉంటాడు. స్థిత ప్రజ్ఞుడు వాటియందు ఆసక్తి చూపడు. సాగరం చూడండి తనలో ఎంత నదీజలం వచ్చి చేరినా పొంగిపోదు. రాకపోయినా చింతించదు. అలాగే స్థితప్రజ్ఞుడు సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు అతీతుడు.

విషం త్రాగితే ప్రమాదం. కాని విషయం చూస్తేనే ప్రమాదం. ప్రాపంచిక విషయాలకు మనస్సులో స్థానం యిస్తే, ఆధ్యాత్మిక చింతన తగ్గిపోతుంది. నిద్రించే ముందు ఉత్పన్నమైన సంకల్పం, నిద్రలో బీజరూపంలో ఉంటుంది. మెలకువ వచ్చిన

తరువాత ప్రకటితమవుతుంది. సంకల్పం మంచిది కావచ్చు, లేదా చెడుది కావచ్చు. జాగ్రదావస్థలో అది బహిర్గతమవుతుంది. స్వప్నావస్థలో అది మనస్సులో ఉంటుంది. సుషుప్తిలో బీజరూపంలో ఉంటుంది. రాగద్వేషాలు లేని కర్మ ప్రారబ్ధకర్మ కానేరదు. దీనికి దృష్టాంతంగా కరెంట్ ఉండగా తిరిగే ఫ్యాన్ కరెంట్ పోయినా కొద్దిసేపు తిరుగుతుంది. అటువంటి కర్మ, కర్మలో అకర్మ.

మమకారముతో అహంకారము కూడి ఉంటుంది. అంధుడిని భోజనానికి పిలిస్తే, వాడిని తీసుకురావటానికి తోడుగా రెండోవాడు కూడా వస్తాడు. అలాగే మమకారం వెంటే అహంకారం కూడా ఉంటుంది.

కర్మవాసనలు రహితమైన మనస్సు నిర్వాణ స్థితిలో ఉంటుంది. అక్కడ మార్పులకి స్థానం లేదు. అటువంటి స్థితిగల మనస్సు ఉన్నవాడు స్థితప్రజ్ఞుడు. ఈ దేహమనే ఆవరణ లేనివాడు. అటువంటివాడు అంతా తానే, ఏదీ తనది కాదు అన్నట్లు ఉంటాడు, అదే స్థితప్రజ్ఞత్వం. అతడే స్థితప్రజ్ఞుడు.

పెదనిండ్రకాలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

నవంబర్ 2026

4 బుధ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

7 శని: నరకచతుర్దశి – శ్రీ సద్గురు పాదపూజ

8 ఆది: దీపావళి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ

24 మంగళ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. శ్రీ సద్గురు పాదపూజ

27 శుక్ర: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం.

డిసెంబర్ 2026

3 గురు: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

16 బుధ: ధనుర్మాస వ్రత ప్రారంభం

20 ఆది: మార్గశిర శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి – శ్రీ సద్గురు పాదపూజ

24 గురు: మార్గశిర పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

నవంబర్ 2026

4 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

7 శని: నరకచతుర్దశి, శనిత్రయోదశి, మాసశివరాత్రి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 ఆది: దీపావళి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

9 సోమ: అమావాస్య – ఆకాశదీపం.

12 గురు: 12 నుండి 20 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన.

13 శుక్ర; నాగుల చవితి

20 శుక్ర; చిలుక ఏకాదశి – ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన.

21 శని: క్షీరాబ్ధి ద్వాదశి – శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 మంగళ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం. జ్వాలాతోరణం

27 శుక్ర; కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 38వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం. ఉ. 10:17 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

డిసెంబర్ 2026

3 గురు: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ. సా.4.41 గం.లకు గోపూజ, యాగశాల ప్రవేశము, మండప పూజలు. దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములోని వారికి శ్రీ సద్గురు మహాపుణ్యారాధన

4 శుక్ర; శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం.

5 శని: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ.

7 సోమ: మాసశివరాత్రి

8 మంగళ: అమావాస్య

15 మంగళ: మార్గశిర శుద్ధ షష్టి – సుబ్రహ్మణ్య షష్టి

16 బుధ: ధనుర్మాస వ్రత ప్రారంభం – తిరుప్పావై, ఋషులచరిత్ర, భాగవత ప్రవచనం.

20 ఆది: మార్గశిర శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి – శ్రీమద్భగవద్గీత పారాయణ, ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 బుధ: దత్త జయంతి – శ్రీ సద్గురు పాదపూజ.

24 గురు: మార్గశిర పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

25 శుక్ర; క్రిస్మస్ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

రామస్యదూతమసక్నున్నమామి

(గత సంచిక తరువాయి) - భాగవతుల హనుమత్ జయప్రద

గత సంచికలో..

ఇక్ష్వాకువంశ గౌరవం కోరే సముద్రుడు, రామకార్యార్థమై వెళ్తున్న హనుమంతుడికి ఏవిధంగా సాయపడగలనా అని ఆలోచిస్తాడు. తాను రామకార్యం చేయలేకపోయినా, చేసే మహానుభావులకైనా తోడ్పడాలి గదా! అని భావిస్తాడు. ఏం చేయాలన్న ఆలోచనలో పడ్డాడు. ఇక్ష్వాకువంశీయుడైన సగర చక్రవర్తి ద్వారా తాను వృద్ధి చెందిన విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. పరాక్రమించిపోతున్న ఆంజనేయుడికి కష్టం కలుగకుండా చూడడమే మేలనుకుంటాడు. పుండరీకాక్షుడైన రామచంద్రుడి దూతకు సహాయం చేయకపోతే, సముద్రుడికి దయాబుద్ధి లేదనుకుంటారనీ, లోకనిందకు గురవుతాననీ భయపడ్డాడు. భగవత్కార్యానికి తోడ్పడే శక్తి వుండికూడా అలా చేయకపోతే అపకీర్తి పాలవుతానని ఆందోళన చెందుతాడు. హనుమంతుడికి ఒకింత బడలిక తీర్చే ఉద్దేశ్యంతో, ఆ తర్వాత తక్కిన ప్రయాణం సులభంగా చేయకలుగుతాడన్న ఆశతో, తనలో దాగివున్న మైనాక పర్వతాన్ని ఆ పనికొరకు పురమాయిస్తాడు సముద్రుడు.



ఈ సంచిక లో – (మేలు చేసినారికి మేలు చేయాలన్నదే సనాతనధర్మం)

మైనాకుడు మేనకకు కొడుకు... హిమవంతుడికి జన్మించాడు.... పార్వతికి తోబుట్టువు. "నీకొక వార్త చెప్తా విను" అని బంగారు శిఖరాల మైనాకుడితో అంటాడు సముద్రుడు. పాతాళంనుండి భూలోకానికి రాకుండా రాక్షసులను అడ్డుకునేందుకు, మైనాక పర్వతాన్ని ఉక్కు గుండులాగ ఉంచాడు ఇంద్రుడు. ఏ ప్రక్కకైనా పక్షిలాగా ఎగిరిపోయే సామర్థ్యం మైనాకుడికుందని గుర్తుచేసాడు సముద్రుడు.

"శ్రీరామచంద్రమూర్తి కార్యార్థిగా అనితరసాధ్యమైన పనిచేయడానికై ఆకాశ మార్గాన పోతున్నాడు హనుమంతుడు. ఇక్ష్వాకువంశంలో పుట్టినవారు నాకు పూజ్యులు. స్నేహంవల్ల, సౌమ్యభావంవల్ల, నీవు నాకొక సహాయం చెయ్యాలి. చేయాల్సిన పని సకాలంలో చేయకపోతే దుష్టుడని సత్పురుషులు కోప్పడుతారు. కాబట్టే సహాయం చేయాలి. హనుమంతుడు మనకు అతిథి, పూజ్యుడు. నీవు నీటిలో నుండి లేచి, ఆయనకు ఎదురేగి, బడలిక తీరేటట్లు నీ తల పైన ధరించు. నీవిట్లా చేస్తే, ఆయనకు కొంత బడలిక తీరుతుంది. తక్కిన సముద్రాన్ని సులభంగా దాటిపోగలడు. రామచంద్రుడి

మంచి నడవడి, భార్యావియోగం, లంకకు వెళ్లే ఆంజనేయుడి శ్రమ ఆలోచించి సంతోషంగా నీటినుండి బయటకు రా" అంటాడు మైనాకుడితో". (ఈ సంభాషణ సారాంశం: భగవత్కార్యం చేసే ఆసక్తి వుండి కూడా చేయలేని వాడు, చేస్తున్నవారిని ప్రేరేపించి, వారితో ఆ కార్యాన్ని విజయవంతంగా చేయించాలనీ, అతిథిని వేరేవిధంగా సత్కరించలేని వారు మంచిమాటలతోనూ, కూర్చోడానికి ఆసనం ఇవ్వడం ద్వారానూ, దాహానికి మంచినీళ్లు ఇవ్వడం ద్వారానూ ఆదరించాలని అర్థం). సముద్రుడి మాటలకు స్పందించాడు మైనాకుడు. మేఘాలను చీల్చుకుంటూ వస్తున్న సూర్యుడిలాగా, నీటిని రెండు భాగాలు చేసి పైకొచ్చాడు. శతసూర్యకాంతితో తన దారికి అడ్డంగా నిల్చిన మైనాకుడిని గమనించి, హుంకరించి, ఆకాశమార్గంలోనే ఢీకొన్నాడు హనుమంతుడు. హనుమ దెబ్బకు, విలపిస్తూ, శోషిల్లి పడిపోయాడు మైనాకుడు. పిడుగుపాటులాగా తగిలిన హనుమంతుడి దెబ్బకు కొంతదూరం వరకూ కొట్టుకుపోయిన మైనాకుడు, లోలోన మటుకు సంతోషించాడు. ఆయన బలాన్ని తెలుసుకున్నందుకు పొంగిపోయాడు. ప్రీతిగా హనుమంతుడితో ఇలా అన్నాడు:

"వాయునందనా! ఎలాంటి అసాధ్యమైన పనికి పూనుకున్నావయ్యా! నీశక్తిని పొగడ ఎవరితరం? నీ బలం, వేగం చూసి మెచ్చుకున్నాను. నా బంగారు శిఖరం మీద నీ శ్రమ తగ్గేంతవరకు నిలిచి, ఆ తర్వాత నీ ఇష్టమొచ్చినట్లుపో. నీ మీద నాకు ప్రేమ కలగటానికి కారణం, మేలు చేసేవారికి, మేలు చేయాలన్న సనాతన ధర్మమే సుమా! సముద్రుడు నీ మేలు కోరి నన్నెంచుకున్నాడు. దానికి కారణముంది. రఘువంశంలో పుట్టిన సగరుడనే రాజువల్ల వృద్ధిచెంది సాగరుడన్న పేరు తెచ్చుకున్నాడు సముద్రుడు. ఆ వంశంలో జన్మించిన శ్రీరామచంద్రమూర్తి కార్యార్థివై పోతున్న నీకు సహాయపడాలని భావించాడు. నీకు సాయపడితే వారికి చేసినట్లే కదా! సాగరుడు కృతజ్ఞుడన్న గౌరవం పొందగోరి నన్ను పిలిచి నీ గురించి చెప్పి, నాకు నిన్ను చూపాడు. రామకార్య ధురంధరుడవగుటచే పుణ్యాత్ముడవైన నీవు నూరు యోజనాల సముద్రాన్ని దాటే ప్రయత్నంలో వున్నావని, నిన్ను నా శిఖరంపై కొంతసేపుంచుకొని, నీ సేదదీర్చితే, మిగిలిన ప్రయాణం కష్టం లేకుండా చేస్తావని, సముద్రాన్ని దాటగలవని నాతో సముద్రుడన్నాడు."

"వాయునందనా! ఆయన ప్రేమతో చెప్పినందువల్ల నీ కొరకై నేనొచ్చాను. నీవిక్కడ కాసేపాగి, ఫలాలు, కందమూలాలు తిని, అలసట తీరేవరకు విశ్రాంతి తీసుకో. తర్వాత మిగిలిన దూరాన్ని వేగంగా, సులభంగా, పోవచ్చు. కొత్తవారైనా సత్పురుషులకు ప్రేమతో పూజించి కైంకర్యాలు చేస్తే మంచిదని పెద్దలంటారు. అతిథి గుణవంతుడైతే కొత్త, పాత అన్న మీమాంస చేయకూడదు. అదలా వుండగా, నేను నిన్ను పూజించడానికి

మరో కారణముంది. మహోత్ముడూ, బలంలో భయంకరుడూ అయిన వాయుదేవుడికి నీవు కొడుకువి. నీ యోగ్యత నాకు తెలిసినా, తెలియకపోయినా, నీ తండ్రి యోగ్యత వల్ల, నేను నిన్ను పూజించదల్చాను. అట్టి మహానుభావుడి కొడుకైన నీవు మాకు అతిథివి కాబట్టి నేనిచ్చే అతిథి సత్కారాలు స్వీకరించు. ఎట్టివారైనా అతిథి పూజ్యుడేకదా! వారిలో సజ్జనుడు మరీ పూజ్యుడు. ఈ మూడు నీలో వున్నందువల్ల నాకు నీవు పూజ్యుడవు. ధర్మం ఇట్టిదని తెలియకపోయినా, తెలుసుకోదల్చినవారికీ, ధర్మం చక్కగా తెలిసినవారికీ అతిథి పూజ్యుడే. అలాంటప్పుడు నీ వంటి సాధుపురుషుడు పూజ్యుడని చెప్పాల్సిన పనే లేదు. మన ఇరువురి సంబంధం ఇదే కాదు. నేనూ నీకు కావాల్సిన వాడినే. కొత్త వాడిని కాను. నీవు వాయువేగ, మనోవేగాలతో పోగలవు. నిన్ను నేను పూజిస్తే వాయుదేవుడిని పూజించినంత" అని మైనాకుడు హనుమంతుడితో విన్నవిస్తాడు.

"నేను నిన్ను పూజించటానికి ఇంకో కారణం కూడా వుంది. పూర్వకాలంలో కొండలకు రెక్కలుండేవి. వాటి సహాయంతో వేగంగా ఆకాశంలో సంచరించేవి. అప్పుడవి తమ తలలమీద పడతాయేమోనని మునులు, దేవతలు భయపడేవారు. ఇది విన్న ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు నరుకుతూ, నా రెక్కలు కూడా నరికేందుకు వచ్చాడు. నీ తండ్రి వాయుదేవుడప్పుడు నన్ను చిమ్ముకుంటూ వచ్చి సముద్రంలో పడేసాడు. అందుచేత నేను రెక్కల అందం చెడిపోకుండా వున్నాను. దీనికి మీ తండ్రి వాత్సల్యమే కారణం సుమా! అందుకే నీ తండ్రీ నాకు పూజ్యుడే. నిన్నూ అందుకే గౌరవిస్తాను. నా స్నేహాన్ని వృథా కానీయకుండా నీవూ నన్ను అలరించాలి. నేను చేసే సత్కారాన్ని స్వీకరించి అలసట తీర్చుకుని, నన్నూ, సముద్రుడిని సంతోషపర్చు" అని అన్న మైనాకుడికి తనదైన శైలిలో జవాబిచ్చాడు హనుమంతుడు.

"పర్వతోత్తమా, నీవు చేసే సత్కారాలు అంగీకరించినట్లే. నీ మంచిమాటల చేతనే సపర్యలు అంగీకరించినట్లయింది. ఆ ఫలం నీకు దక్కింది కూడా. నేను సంతోషించాను. నేనిక్కడ ఆగకూడదు. కార్యం, కాలం నన్ను తొందరపెడుతున్నాయి. చేయాల్సినపని చాలా వుంది. చీకటి పడిపోతున్నది. ఇంకా ఆలస్యమైతే చేయవలసిన పనికి తగినంత పొద్దులేదు. నేను ఎక్కడా ఆగనని, రామబాణంలా వెళ్ళి, పని చక్కబెట్టు కొస్తాననీ వానరులతో ప్రతిజ్ఞ కూడా చేసాను. నన్నాపవద్దు... కోప్పడవద్దు మిత్రమా!" అన్నాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

కాలిన నాలుక – కాలని అగ్ని

రాముడు హనుమంతుని పిలిచి, "సీతవద్దకు వెళ్ళి, రావణుని ముగింపు విషయమును తెలియజేయుము" అని చెప్పాడు. హనుమ ఆమెకు సంతోషకరమైన ఈ విషయమును తెలియజేయ, ఆమె హనుమను జూచి, ప్రేమతో ''నీకు నేనేమి ప్రత్యుపకారము చేయగలను?" అన్నది. "తల్లీ! నన్ను సమ్మతించండి. మిమ్ములను ఎంతగానో బాధపెట్టిన ఈ అసుర స్త్రీలను పిండి గావించెదను" అన్నాడు. అలా చేయవలదని ఆమె అతనిని వారించి, బుద్ధిచెప్పి, కరుణా స్వరూపిణి అయిన సీత ఇలా చెప్పింది: "ఈ విశ్వమందు ఎవరు తప్పుచేయలేదు? నిజానికి వీరందరూ తమ యజమాని ఆనకు కట్టుబడి నడుచుకున్నారు. బాణం సంధించినవాడు చేసిన తప్పుకు ఆ బాణమును శిక్షించ వచ్చునా?"

రావణుని అంతిమ సంస్కారములు ముగియగనే విభీషణునికి లక్ష్మణుడు పట్టాభిషేక మొనర్చాడు. పిదప రాముడు విభీషణునికి సీతను తీసుకునిరమ్మని పని అప్పగించాడు. సీత తిరిగివచ్చి, ఆగ్రహముతో కుడినదై, ఎరుపెక్కిన మోముతో కూడిన రామునికి వందనమొసగింది. (ఇచ్చట సీతను ఉద్దేశించి రాముడు అన్న మాటలను వాల్మీకి వర్ణనలో తెలుసుకుందాము)

ప్రాప్తచారిత్రసందేహ మమ ప్తరిముఖే స్థితా
దీపో నేత్రాతురస్య ప్రతికూలాసి మే ధృడమ్॥
కః పుమాంస్తు కులే జాతః స్త్రియం పర గృహాషితామ్
తేజస్వీ పురరాదద్యాత్ సుహృల్లేఖ్యేన చేతసా॥

("ఈ కొద్దికాలంలో నీ చరిత్ర సందేహాస్పదమయ్యింది. నీవు నా ఎదురుగా నిలబడి ఉంటే చూడలేకపోతున్నాను. కంటిజబ్బుతో బాధపడుతున్న వాడికి తేజోవంతమైన దీపం ఇస్తే ఎంత బాధగా, సొప్పిగా వుంటుందో అలా వుంది నాకు." "ఉన్నత కుటుంబంలో పుట్టిన ఏ మగాడైనా కొంతకాలము పరుల గృహంలో ఉన్న భార్యను ఆసక్తితో తిరిగి స్వీకరిస్తాడా!" అని అన్నాడు రాముడు.)

సీత సమాధానము వాల్మీకి వర్ణనలో ఇలా ఉంది.....

"కిం మామసదృశం వాక్యమీదృశం శ్రోత్రదారుణమ్

రూక్షం శ్రావయసే వీర ప్రాకృతః ప్రాకితామివ"

" ఓ వీరుడా! నీవు ఒక సామాన్య మానవుడు ఒక సామాన్య స్త్రీతో మాట్లాడినట్లు మాట్లాడుచున్నావు. అనకూడని, వినకూడని పరుషమైన మాటలను మాట్లాడావు. నేను అయోనిజను. మన వివాహం అయినప్పటినుండి నా గురించి, నా సత్ప్రవర్తనను గురించి ఆలోచించు. నీ అనుమానమును విడిచిపెట్టుము." ఆమె మాటలను వినిన రాముడు ఇలా పలికాడు.

"సీతా! నిన్ను చెరనుండి విముక్తి గావించుటతో నాయొక్క క్షత్రియ ధర్మము ముగిసిపోయింది. సుమారుగ ఒక సంవత్సరకాలము ఇంకొకరిచే చెరబట్టబడిన నీతో నేను ఇక సహజీవనము సాగించలేను. కావున నీవు ఎవరితోనైననూ ఉండవచ్చును" అని నిష్ఠలుగ్రక్కు పదములనుచ్చరించాడు. ఆతని మాటలకు సమాధానముగ సీత ఇలా అన్నది (వాల్మీకి రచనలో)

" సహసంవృద్ధభావేన సంసర్గేణ చ మానద
యదితే అహం న ష్టితా హతా తేనాస్మి శాశ్వతమ్"

"మన వివాహము అయినప్పటినుంది మనము ఇద్దరమూ కలసి మెలసి ఉన్నాము. నా పుట్టుకకుగాని, నా ప్రవర్తనకుగానీ నీవు గౌరవం ఇవ్వలేదు. నీ ఎడల నా భక్తిని, నా శీలమును కూడా పరిగణించకుండా నన్ను అనరాని మాటలు అన్నావు. ఇంక నేను బ్రతికి ఉండడం వృధా!" అన్నది సీత. కన్నీరు కుండపోతగ పొంగి పొరల, "లక్ష్మణా! నీవు తక్షణమే ఎండిన కట్టెలను తీసుకుని వచ్చి అగ్నిని రగుల్చుము" అని తన మరిదిని ఆజ్ఞాపించింది.

లక్ష్మణునితో సహా అక్కడ ఉన్నవారికెవ్వరికీ ఏమియూ బోధపడలేదు. "ఇది ఏమి విపరీతము?" అనుకున్న వారందరూ ఒక్కమారు రామునివైపు చూసారు. రాముడు మౌనంగా వుండి పోయాడు. అగ్ని ముట్టించబడింది. సీత ఆ అగ్నిలో ప్రవేశించకముందు "నా మనస్సు రాముడియందే ఉన్నదైతే, సర్వకాలములయందు రాముడిని ధ్యానము చేసిన దాననైతే, పృథ్వీ, ఆకాశము, అష్ట దిక్పాలకులు, అంతరాత్మ, అగ్ని సాక్షిగా ఉండి, ఒక్క క్షణం కూడా నా మనస్సు రాముడిని విడిచిపెట్టనిది నిజమే అయితే ఈ అగ్నిహోత్రుడు నన్ను రక్షించుగాక" అని చెప్పి అగ్నిలో దూకింది.

- సశేషం

అథ ప్రథమోధ్యాయః

యస్య స్మరణ మాత్రేణ జ్ఞానముత్పద్యతే స్వయం
స ఏవ సర్వ సంపత్తిః తస్మాత్సం పూజయేద్గురుమ్. 55

పదవిభాగము :-

యస్య-స్మరణ మాత్రేణ-జ్ఞానం-ఉత్పద్యతే-స్వయం-స ఏవ-
సర్వసంపత్తిః- తస్మాత్-సంపూజయేత్-గురుమ్

టీక :- యస్య=ఏ గురుదేవుని; స్మరణమాత్రేణ= స్మరణ మాత్రముచేతనే; జ్ఞానం=బ్రహ్మజ్ఞానము; స్వయం=స్వయముగా; ఉత్పద్యతే=పుట్టుచున్నదో (కలుగుచున్నదో); తస్మాత్=ఆకారణము వలన; గురుం=గురుదేవుని; సంపూజయేత్=చక్కగా పూజింపవలెను.

వ్యాఖ్య :- " గురు దేవుని ఉపాసించిన మాత్రమునకే, స్వయముగా బ్రహ్మ జ్ఞానము కల్గుచున్నది, అందుచేత గురుదేవుని చక్కగా ఉపాసించవలెను" అని కృపతో వివరిస్తున్నాడు ఆది గురుదేవుడు. ఇతరులెంత బోధించినను, వేదములనెంత శోధించినను తెలియరాని జ్ఞానము కేవలం గురూపాసన వలన పొందబడుతుంది అన్నది యిక్కడ వివరణ. అది ఎలా సంభవము అనగా కేవల భావన వలన కీటకము భ్రమరముగా మారుట ప్రసిద్ధమే గదా! అగ్నిలో హోమం చేయబడిన నెయ్యి అగ్ని రూపాన్ని పొందుతుంది గదా? అగ్ని సంబంధం వలన కర్పూరం అగ్ని రూపాన్ని ధరిస్తుంది, అగ్ని యందు వ్రేల్చిన సమిధ అగ్ని రూపాన్ని పొందటం అనుభవంలో ఉన్నదే గదా? కనుక గురూపాసన వలన శిష్యుడు గురు స్వరూపాన్ని స్వయంగా పొందుతాడు అని యీ శ్లోకం తెలియజేస్తున్నది. అందువలన శిష్యునకు గురూపాసన విధింపబడుతున్నది.

క్రిమి కోటి భి రావిష్టం దుర్గంధ మలమూత్రకమ్
శ్లేష్మ రక్త త్వచా మాం సై ర్బద్ధం చైతద్వరాననే. 56

పదవిభాగము :-

క్రిమికోటిభిః-ఆవిష్టం-దుర్గంధ మలమూత్రకం-శ్లేష్మ, రక్త, త్వచా, మాంసైః-నద్ధం-చ-ఏతత్-వరాననే.

టీక :- వరాననే!= హే పార్వతీ! ఏతత్=ఈ శరీరరము క్రిమికోటిభిః=కోట్లాది క్రిములతో;అవిష్టం =కూడినది; దుర్గంధమలమూత్రకం=మల మూత్రముల చేత దుర్గంధ పూరితమైనది; శ్లేష్మ రక్త, త్వచా మాంసైః= శ్లేష్మము, రక్తము, చర్మము, మాంసము మొదలైన జుగుప్సాకర పదార్థములచే; నద్ధం=కట్టబడినది (కూర్చబడినది).

వ్యాఖ్య :- " ఓ పార్వతీ! ఈ దేహము కోట్లాది క్రిములకు నిలయము, మల మూత్రాదుల వలన దుర్గంధ భూయిష్టము, శ్లేష్మ రక్తత్వచా మాంసాది జుగుప్సాకర విషయ పూర్ణము. దీనిలో నచ్చదగినదిగాని, మెచ్చదగినదిగాని లేదు, ఇది పరిహార్యము" అని శరీర తత్వమును గురించి దాని హేయ స్థితిని గురించి తెలియజేస్తున్నాడు పరమాత్మ. ఇంతవరకు గురుదేవుల ఔన్నత్యాన్ని గురించి తెలియజేసిన స్వామి ఇప్పుడు శరీరం ఎంత పనికి మాలినదో చెప్పి, దీనిని ఉపయోగానికి తెచ్చుకోవాలంటే కేవలం దీనిని గురూపాసనకై వాడుకోవటమే మార్గమని తెలియజేస్తున్నాడు. శరీరం హేయమైనదే కావచ్చు, కాని దాని వలన కూడ సాధింపబడవలసిన ప్రయోజనమున్నది, ఆ ప్రయోజనము కీటకము తనను తాను భ్రమరముగా మార్చుకొనుట వంటిది. ఈ హేయ శరీరాన్ని గురూపాసనాగ్నిలో యింధనంగా వ్రేల్చితే అది కూడ గురు స్వరూపాన్నే పొందుతుందని సూచిస్తున్నాడు. సాధకుడికి గురూపాసన ఎలా తప్పని సరియైనదో తెలియజేస్తున్నాడు సదాశివుడు.

- సశేషం

శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, శ్రీమతి నూతులపాటి సుచిత (బొంబాయి కృష్ణారావుగారి ధర్మపత్ని) గారు 14-10-26 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 70 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

జపతపములను సువాసనముల్ నెరుగను
నేవ్రతములు పూజలు జేయుటెరుగ మనసు
నందు నీపదముల్ నిల్పి నీస్మరణము
జేయు బుద్ధి నొసగు దేవ నదియెదీక్ష ॥
నీనివాసమై వెలుగొందు ఆశ్రమమున
నీమృదు పదద్వయముతో పవిత్రమైన
తావునుందుటకాశ్రమ వాసు లేమి
తపము జేసిరో నూహించుటెట్లు దేవ ॥
నది సముద్రునిలో జేరి శాంతి నొందు
జనులు సంసార జలధిదాటి నిన్ను జేరి
శాంతి నొంద, అహంకారమమతలను మొ
సళ్ళను త్రుంచి నీదరి జేర నీవ ॥
నిన్ను పూజించుటన్న కరముల కిష్ట
ము, నినువర్ణించుట జిహ్వాకిష్టము, నిను
జూచుటా కనులకు కిష్టము, మ్రొక్కుట కిష్ట
ము శిరమునకు, నీబోధ వీనులకు విందు ॥
బ్రహ్మ లోకవాసం, స్వర్గలోక వాస
మొద్దుగాని నీవవతరించు సమయమున
మాత్రమునను సృజింపు, నీలీలలు మర
ల మరల తనివి తీరజూసి తరియింతు ॥
తెలియని తనముచే తేటగీతు లందు
నాదు భావన తెల్ప యత్నించిన లఘు
వును గనుక తప్పులున్న క్షమించి
పుత్ర వాత్సల్యమున్ జూపు గురుమూర్తి ॥

శ్రీబాబు 1988వ సంవత్సరంలో అమెరికా వెళ్ళినప్పుడు ఆశ్రమములోని సంగతులు మరియు ఆశ్రమవాసులు ఎలా స్వామివారి రాకకై ఎదురు చూస్తున్నారో అని పద్యరూపాన శ్రీమతి కాళీ శ్రీబాబుకు హృదయలేఖలో ఇలా చెప్పారు (జూన్,1988 సంవత్సరం సమర్థ సద్గురులో హృదయలేఖ అనే శీర్షికన ప్రచురించబడినవి)

హృదయలేఖ

నాడు గోపికల నడుమాడుచునె అంత

నె మాయంబు యయిన ఆనల్లనయ్య
అంతటను తన కొరకు వెతకుచు నున్న
వారి వేదన గని దర్శనంబు నిచ్చె ॥
నేడు మాచెంత నివసించు బాబు తరలి
వెళ్ళె అన్యదేశమునకు, మాకు గోపి
కల సమంబగు నిర్మల భక్తి నొసగు
తరుణ మేమొ మాసద్గురు లీల యేమొ ॥
తనయు నాకలి తల్లియే యెరుగు, శిష్య
ని పిలుపున్ సద్గురుడె యెరుగు మరి బాహ్య
పిలుపు కాదది హృదయంబులోని ఆర్తి
అందుకే వెళ్ళె నాదేశమునకు బాబు ॥
భువన మోహనాకృతిని దర్శింప కనులు,
నీ ప్రబోధామృతమునకు వీనులున్, ప
ద ద్వయంబునకు మ్రొక్క మాశిరము, పాద
తీర్థము గ్రోల మనసునూ వేచియుండె ॥
వయసు నెంతవారమయిన ఆత్మ విద్య
యందు పిన్నవారలమెగ జ్ఞాన బోధ
జేసి దీవించ మమ్ము వేవేగరమ్ము
దీనవత్సల సద్గురు దేవదేవ॥
ఘోర తపములు నుపవాసములును జేయ
లేను, వేదపారాయణ మయిన జేయ
పండితుడను గాను, మరి నే నేమి జేయ
ను విను మెప్పించి రప్పింప నిటకు బాబు?॥
ప్రియ తనయుహ స్తపూజకై లోక జనని
కాళికమాత, సఖునితో నాటలాడ
రామకృష్ణులు, తన మేను తల్పముపై
పవ్వళించు ఆస్వామికై శేషుడేచె (శేషుడువేచె) ॥
ఆశ్రమ వనంబున విరులు స్వామి పాద
పద్మముల పూజకు యెదురు జూసె, గున్న
మామిడులు కొత్త చిగురులు గుబురుగాను
వేసి సేదతీర్చ స్వామికొరకు జూసె ॥
స్త్రీ పురుషులను బాలలు వృద్ధులు నిలు

వెల్ల కన్నులు జేసి, రమ్యంగ రంగ
వల్లులున్ వేసి, మనసు ఆసనమువేసి
ఆశ్రమ నివాసులుండిరి స్వామి మీకై ॥
రోజులున్ వారముల్ పక్షముల్ నెలలును
గడచె నింక క్షణంబొక యుగము గాను
తోచె యిక పరిక్షింపకు దుర్బలులము
కరుణతో కావ రమ్ము వోదీనబంధు॥
గరుడ వాహనంబు కొరకు, తోడుగాను
వచ్చు పరివారమునకును, ఆయుధముల
కొరకు జాగుసేయకుమీ పరుగుపరుగున
రమ్ము దీవింపమమ్ము వో లోకనాధ॥
సాధు సజ్జన గోష్ఠిలో మునిగియుండె
నో, మరే విదురుని విందుకైన వెళ్ళె
నో, మరెవరైన పాహిపాహి యని పిలువ
వెళ్ళెనో నీవు తెల్పుమో రామలింగ॥
నీ పద ద్వయం కాశి రామేశ్వరములు
మాకు, నీ నామమే మాకు నిత్య మంత్ర
ము, మరి నీపలుకుల్ అమృతపుతునకలు
నీవు యున్న తావె అలవై కుంఠపురము॥
ఈశ్వరాభిషేకంబుతోనె శివరాత్రి
వెళ్ళె, పంచాంగ పఠనంబుతోనె ఆ ఉ
గాది గడచెను, శ్రీ రామ నవమిగూడ
వచ్చె మాబాబు వేంచేయు టెప్పుడుమరి? ॥
రోట బంధింప నిను ఆ యశోద లేదు,
వనములకు బంప ఆకైకలేదు యుద్ధ
ము సలుపంగ రావణుడు లేడు ఆట
లాడి అల్లరి చేయవేగంబు రమ్ము॥

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

గుంటూరు భక్తులతో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీశైలక్షేత్రం నుండి బయలుదేరి శ్రీ బాబు భక్తులకు మహానంది క్షేత్రమును దర్శింప చేశారు. మహానందిలోని స్ఫటిక స్వచ్ఛమైన తటాకములో స్నానము ఒక మధురానుభూతి. ఆ నీటిలో నిలబడి స్నానం చేసేవారికి నీటిలో పడవేసిన చిన్న గుండుసూది కూడ చక్కగా కనిపిస్తుంది. "భక్తుని అంతరంగం యిలా నిర్మలంగా ఉంటే ఆ అంతరంగంలో ప్రకాశించే భగవానుడు ఇలానే దర్శనమిస్తాడు" అని శ్రీ బాబు చెప్పారు.



1961లో యిలా ప్రారంభమైన శ్రీశైల యాత్రలు1965 వరకు వరుసగా అయిదు సంవత్సరాలపాటు జరిగాయి. ఈ యాత్రల నిర్వహణలో పాండు అత్యంత శ్రద్ధా భక్తులతో అన్ని ఏర్పాట్లను తమ వ్యక్తిగత పర్యవేక్షణలో జరిపి శ్రీ బాబుకు, భక్తులకు ఎనలేని సేవ చేసుకున్నారు.

1963లో జరిగిన శ్రీశైలయాత్రలో చిరంజీవిరాజుగారు శ్రీ బాబును తాము కోరుకున్న విధంగా, శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీ సద్గురు చరణసాయుజ్యం పొందిన విషయం యిదివరకే తెలుసుకున్నాము.

1966లో కార్తీక పూర్ణిమకు శ్రీ బాబు భక్తులందరిని అమరావతీ క్షేత్రానికి తీసుకొని వెళ్ళారు. అక్కడ నుండి పడవలో వైకుంఠపురం చేరుకొని అక్కడ భక్తులందరితో శ్రీకృష్ణానదీ స్నానం చేశారు. నదీ స్నానం శ్రీ బాబుతో చేసినపుడు జరిగే అద్భుత సన్నివేశాలను మరొక సందర్భంలో వివరించటం జరిగింది. అవన్నీ భక్తుల మధురానుభవాలు. దివ్య ఘట్టాలు.

శ్రీ బాబు వినాయక చవితి పండుగ సందర్భంగా 1961 నుంచి 1963 వరకు వల్లభాపురంలో బసవయ్యగారింట్లో పూజలు జరిపారు. 1964 నుంచి ఆ పూజలను గుంటూరులో బ్రాడీపేటలోని తమ యింటిలో జరపటానికి పాపాయమ్మగారు , కాంతమ్మగారు శ్రీ బాబును ప్రార్థించి అంగీకరింపజేశారు. అప్పటి నుండి 1971 వరకు వారింట్లోనే

గుంటూరులోను, 1972 ఆశ్రమ స్థాపనానంతరము యిప్పటి వరకు ఆశ్రమంలోను వారి కుటుంబం తరపున పాండు నియమ బద్ధంగా వినాయక చవితి పూజలను జరుపుకుంటున్నారు.

శ్రీ బాబు 1936 ప్రాంతంలోనే గుంటూరులో వెల్లడైనారని చెప్పుకున్నాము. అప్పటిలోనే శ్రీ బాబు దర్శన భాగ్యము పొందిన వారిలో నూనె శివయ్యగారు, ఆకుల రత్తయ్యగారు మొదలైన వారు ఉన్నరు. నూనె శివయ్యగారు రాత్రి సమయాలలో తమ యినప్పెట్టె చుట్టూ తిరుగుతూ "హరేరామ హరేరామ..." నామం బిగ్గరగా చేస్తూ మెలకువగా ఉండేవారు. శ్రీ బాబు శివయ్యగారితో యీ విషయం ప్రస్తావించి, "శివయ్యగారూ! మీరు ధనమును రక్షించుకోవటం కోసమైనా భగవన్నామం చేస్తున్నారు. కరుణామయుడు, అల్ప సంతోషి అయిన భగవానుడు దానికే సంతోషించి మీకు, మీ ధనానికి రక్షణ కలిగిస్తున్నాడు. చూశారా! మరి మీరు చేసే ఆ భగవన్నామంలోనే మనసు నిలిపి ధనాన్ని గురించిన భయంతో గాక, దానిని ప్రసాదించిన భగవంతుని యందు భక్తితో చేశారనుకోండి, అప్పుడు ఆ లక్ష్మీదేవితో సహా ఆ నారాయణ మూర్తినే మీ హృదయమనే యినప్పెట్టెలో బంధించి భద్రపరచుకో గలుగుతారు. అప్పుడు ధనం ప్రసాదించే లక్ష్మీదేవి, జ్ఞానాన్ని ప్రసాదించే నారాయణ మూర్తి కూడా మిమ్మల్ని సదా రక్షించుకుంటారు" అని చెప్పారు.

శివయ్యగారి కుమారుడు మహాబలేశ్వరరావుగారు ఆ రోజులలో చిన్నకుర్రవాడే. అతనితో కలిసి వాళ్ళ మేడలో దాగుడుమూతలు ఆడుకొనేవారమని శ్రీ బాబు చెప్పారు.

1969 నుంచి 1971 వరకు కార్తీక పూర్ణిమ పూజలు చీరాలలో పాపాయమ్మగారి పెద్దల్లుడు నూనె వెంకటస్వామిగారింట్లో జరిగాయి. వారు శ్రీ బాబును ఆహ్వానించి తమ యింట్లో భక్తులందరితోను యిలా పండుగలు జరుపుకోవాలని ఎంతో ప్రాధేయపడి శ్రీ బాబును సమ్మతింపజేశారు.

- సశేషం

జ్ఞాన క్షీరం

- పాలూరి ప్రసాద్

మనందరికీ పుట్టగానే తెలిసేది ఏడవటం, ఆ తరువాత తల్లి పాలు త్రాగడం. క్షీరద జాతులలో ఏ ప్రాణి అయినా పుట్టిన మొదటి కొన్ని రోజులూ జీవించేది, పోషించబడేది తల్లిపాలతోనే. అయితే ఇన్నాళ్ళూ మనం కేవలం ఒక తల్లి తన బిడ్డల ఆకలి తీర్చడం కోసం పాలిస్తుందని మాత్రమే అనుకునేవాళ్ళం.



కానీ ఈ మధ్య శాస్త్రజ్ఞులు చేసిన పరిశోధనలలో అనేక ఆశ్చర్యకర విషయాలు వెలుగుచూశాయి. ఇది కేవలం వన్‌వే ట్రాఫిక్ కాదు. తల్లి ఇచ్చేది కేవలం పాలు కాదు. బిడ్డ తల్లి దగ్గర పాలు త్రాగేటప్పుడు ఆ బిడ్డ లాలాజలం తల్లి శరీరంలోకి ప్రవేశించి పరీక్షించబడుతుంది. తద్వారా ఆ బిడ్డ శరీరంలో వున్న ఏమైనా పోషణ లోపాలు, రుగ్మతలు గుర్తించబడి తరువాత వచ్చే పాలలో వాటికి విరుగుడు అయిన పదార్థాలు, కావలసిన పోషక పదార్థాలు ఆ పాలకి జోడించబడతాయి.

శాస్త్రజ్ఞులు ఇలా ఇప్పటికి తల్లి పాలలో వంద రకాల వివిధ పోషకాలు గుర్తించారు. అయితే ఇది కేవలం లవలేశం మాత్రమేనని, ఇంకా కొన్ని వేల పదార్థాలు గుర్తించబడాలని వారు చెబుతున్నారు. ఈ మధ్య ఒక తల్లి తన బిడ్డ మామూలుగా వున్నప్పుడు, జ్వరంగా ఉన్నప్పుడు, అలాగే తాను ఉద్యోగరీత్యా కొన్ని గంటలు బిడ్డకు దూరంగా ఉండి బిడ్డ శరీరంలో ద్రవపదార్థాలు తగ్గిపోయినప్పుడు ఇలా రకరకాల పరిస్థితులలో తన స్తన్యాన్ని సేకరించి ఆ స్తన్యంలో వచ్చిన మార్పులు స్పష్టంగా వీడియో తీసి నిరూపణగా సామాజిక మాధ్యమాలలో చూపించింది. పోతపాలలో మహా అయితే రెండు మూడు రకాల పోషకాలను కలపగలరేమో కానీ ఎప్పటికప్పుడు తన బిడ్డ పరిస్థితికి అనుగుణంగా ఇలా మారే పాలను ఎవరు తయారు చేయగలరు? శ్రీగురుదేవులు కూడా సరైన సమయం వచ్చినప్పుడు తనకు తానుగా వచ్చి గురువును ఆశ్రయించిన శిష్యులకు లభించే అనుభూతిని తల్లి పాలతోనూ, ఆ సమయం రాకుండానే ఎవరి ప్రోద్బలంతోనో, మొహమాటానికో వచ్చే వారు పొందే అనుభూతిని పోతపాలతోనూ పోల్చేవారు.

మిగిలిన జంతువులన్నీ పుట్టగానే లేచి పరిగెడతాయి. లేదా కొన్ని రోజులో, వారాలో మాత్రమే తల్లిపాల మీద ఆధారపడతాయి. కానీ మానవులు మాత్రం దాదాపు సంవత్సరం వరకు పూర్తిగా తల్లి సంరక్షణలోనే పెరగాలని భగవంతుని నిర్ణయం. ఈ

సంవత్సర కాలంలో ఆ బిడ్డ బుద్ధి వికసించడానికి తల్లి పాలు ఎంతగానో వుపయోగ పడతాయి. మిగిలిన ప్రాణులకు లేనిది, మానవునికి మాత్రమే భగవంతుడు ప్రసాదించినది బుద్ధి ఇంద్రియమే కదా! అయితే ఈ బుద్ధి వికాసం కేవలం ప్రాపంచిక విషయాలలోనే జరుగుతుంది. అసలైన ఆధ్యాత్మిక వికాసం కలగాలంటే గురుదేవుల వద్ద జ్ఞానక్షీరాన్ని గ్రోలవలసిందే. మామూలు తల్లికి తన శరీరంలో జరిగే ఇంతటి ప్రక్రియ తెలియదు. బిడ్డ ఆరోగ్యాన్ని పరీక్షించడం, అందుకు తగిన విధంగా తన పాలను మార్చుకోవడం ఈ ప్రక్రియ అంతా ఆ తల్లికి ఏమాత్రం తెలియకుండానే జరిగిపోతుంది. అయితే గురుదేవుల విషయంలో మాత్రం ఇదంతా వారికి తెలిసే జరుగుతుంది.

ఏ శిష్యుడి మనస్సులో ఎప్పుడు ఎలాంటి ఆలోచనలు చెలరేగుతున్నాయో, ఎప్పటికప్పుడు గ్రహించి దానికి తగిన బోధని అందించడమే కాకుండా భవిష్యత్తులో రాబోయే ఆలోచనలు, త్రొక్కబోయే చెడు దారులను కూడా ముందే గ్రహించి అందుకు తగ్గ నివారణోపాయాలను తమ బోధలో నిక్షిప్తం చేస్తారు. అంతే కాదు, ఒక సభలో గురుదేవుల బోధలో వినిపించే ఒక్క వాక్యం అక్కడ ఆశీనులై ఉన్న వందల మంది శిష్యులలో ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా అర్థమై వారి వారి జీవన విధానంలో పెనుమార్పులు తీసుకువచ్చే సాధనం అవుతుంది. ఇది మనందరికీ అనుభవంలోనిదే కదా! శ్రీగురుదేవులు అన్నట్లుగా వారిది తెలిసిన బాధ, మనది తెలియని బాధ. అందుకే వారికి సర్వసమర్పణ చేసుకొని వారు సూచించిన మార్గంలో తు.చ. తప్పక నడవటమే మనకు శ్రేయోదయకం.

శిశువు తల్లి పాలు త్రాగినంత కాలం ఎటువంటి భయాలు, బంధనాలు, పరిమితులు లేకుండా స్వేచ్ఛగా ఉంటాడు. బోర్లపడటం దగ్గరినుంచి నడవటం వరకు అన్నీ ఎంతో కష్టపడి నేర్చుకుంటాడు. ఎందులోనూ 'ఇది నేను చేయగలనా?' అనే సందేహం ఉండదు. కానీ మెల్లిగా బయటి ఆహారం అలవాటైన కొద్దీ భయాలు, పరిమితులు పెరుగుతాయి. నలుగురిలో మాట్లాడాలంటే భయం, క్రొత్త విషయాలు నేర్చుకోవాలంటే భయం. క్రొత్త రంగంలోకి అడుగు పెట్టాలంటే ఎన్నెన్నో పరిమితులు. అలాగే శిష్యుడు ఎప్పుడైతే కేవలం తన గురుదేవులు అందించే జ్ఞానక్షీరాన్ని మాత్రమే నిరంతరం గ్రోలుతూ ఉంటాడో ఆ శిష్యుడికి ఎటువంటి భయాలు, పరిమితులు వుండవు. అట్టి శిష్యుడు సాధించలేనిదంటూ ఏమీ ఉండదు. కానీ గురుబోధా శ్రవణం చేస్తూ కూడా తన మనస్సును ప్రాపంచిక విషయాల పైకి పరుగులెత్తించే శిష్యునికి అన్నీ భయాలే, పరిమితులే.

- సశేషం

దానశీలత్వం

–శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి

పూర్వము ఒకప్పుడు కర్ణుడు తన గృహంలో అభ్యంగన స్నానం చేస్తున్నాడు. నవరత్న ఖచితమైన ఒక పాత్రలో నూనె, మరొక పాత్రలో సున్నిపిండి ఉంచుకుని, ఒక చోట కూర్చుని స్వయంగా నూనెతో తలంటుకుంటున్నాడు. సరిగ్గా శ్రీకృష్ణుడు అదే సమయానికి అతని గృహానికి వచ్చాడు. కర్ణుడు తలంటుకోవటం, ప్రక్కనే నవరత్న ఖచితమైన పాత్రలు ఉండటం చూసి, నటనసూత్రధారియైన గోవిందుడు ఆ పాత్ర తనకి కావాలని అడిగాడు.

దేవేంద్రునకు తన సహజ కవచకుండలములనే దానము చేసి, దానకర్ణుడు అనిపించుకున్న మహానుభావుడు, ఇప్పుడు సాక్షాత్ పరమాత్ముడే చేయిచాచి, గిన్నె ఇమ్మని అడిగితే కర్ణుడు వెనుకంజ వేస్తాడా?

వెంటనే కర్ణుడు కుడిచేత్తో తలంటు పోసుకుంటున్నాడు కనుక, ఎడమచేతితో ఆ గిన్నెను తీసి శ్రీకృష్ణుడికి సమర్పించబోయాడు. కాని కృష్ణుడు దాన్ని తీసుకోకుండా, "కర్ణా! నీ ఎడమచేతితో నాకు సమర్పించుట? ఇది శిష్టాచారము కాదని నీకు తెలియదా?" అని అడిగాడు.

కర్ణుడు "ఓ కృష్ణా! ఇప్పుడున్న ధనము మరుక్షణంలో మాయమై పోవచ్చు! ఇప్పుడున్న జీవితం ఉత్తరక్షణంలో అంతమైపోవచ్చు! యమధర్మరాజు ఎవరిపైనను విచక్షణ చూపడు. జీవుల ధర్మబుద్ధి త్వరితగతిని మార్పునొందుచుండును! కాబట్టి తలంటుకొనుచున్న నూనె చేతిని, కడిగి దానితో నీకు ఆ పాత్ర ఇచ్చే లోపల నా బుద్ధి ఏమి మారిపోవునో! అంతవరకు నా జీవితం ఉంటుందో లేదో! అనే విచికిత్స నాలో కలిగి, తత్ క్షణమే నేను దాన్ని నీకు ఇవ్వబోయాను. అంతేకాని నాకు తెలియక కాదు" అని అన్నాడు.

కర్ణుడి ఆధ్యాత్మిక భావపరిపూర్ణమైన ఆ మాటలు విని శ్రీకృష్ణుడు చాలా సంతోషించాడు.

దాన ధర్మాలను వెనువెంటనే చేయవలెను. జీవితం క్షణ భంగురమని గుర్తెరిగి ధర్మకార్యాలను విరివిగా చేయవలెను.

విష్ణు కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

త్రైలింగ స్వామి

'ఈ జన్మలో నీకు ప్రాప్తించిన విద్యను, బుద్ధిని, స్వభావాన్ని పరిశీలిస్తే పూర్వజన్మలో ఎలా ఉండేవాడివో నీకే తెలుస్తుంది. అలాగే ప్రస్తుత జీవితాన్ని నువ్వు చూస్తూనే ఉన్నావు. ఈ జీవితంలో ఏమి మంచి చేశావో, చెడు చేశావో నీకే బాగా తెలుసు. మంచి చేస్తే మంచి జరుగుతుంది, చెడు చేస్తే చెడు.



పూర్వజన్మ సుకృతం వల్ల బ్రాహ్మణ వంశంలో పుట్టావు. నీవు బ్రాహ్మణోచితమైన పనులు జేసి సన్మార్గంలో ఉంటే ఆత్మోన్నతిని పొందుతావు. నీవు చేసే పనులను బట్టి నీ పునర్జన్మ ఉంటుంది. అందువలన నీ పునర్జన్మను నీవే స్వయంగా నిర్ణయించుకోగలవు. నీవు ఇంకొకరిని అడుగవలసిన అవసరం లేదు. ఇప్పుడు నామీద నమ్మకం కలుగటానికి కొన్ని విషయాలు చెబుతాను."

ఏమీ చెప్పకుండానే స్వామివారు నా మనస్సులోని మాటలను గ్రహించగలిగారని, ఆయన సర్వాంతర్యామి అని నిర్ణయించుకున్నాను.

స్వామివారు చెప్పారు "నీ పేరు ఇది, నీ తండ్రిపేరు ఇది, నీవు ఫలానా గ్రామస్తుడవు, నీ ఇంట్లో ఇన్ని గదులున్నాయి, ఇంటికి ఫలానా దిక్కున చెరువు ఉంది, ఆ చెరువు ఒడ్డున ఫలానా ఫలానా చెట్లు ఉన్నాయి, నీ ఇంట్లో ఫలానా వారు నివసిస్తూ ఉంటారు" అని స్వామివారు చెప్తే ఆశ్చర్యపోయాను.

స్వామివారు ఇంకా చాలా చెప్పారు. "మీరు పూర్వజన్మలో బ్రాహ్మణులు, ఫలానా గ్రామంలో, ఫలానా పేరు గల జమీందారుగా ఉండేవారు. నీవు చాలా మంచివాడివి. నీ మేడ రెండో అంతస్తులో నీ శయన మందిరం ఉంది. ఆ ద్వారంపై నీవు స్వయంగా నీ చేతులతో వ్రాసిన మూడు శ్లోకాలు ఇప్పటికీ ఉన్నాయి. వెళ్ళి చూసుకో!" అన్నారు.

స్వామివారు మళ్ళీ ఇట్లా చెప్పసాగారు. "ఫలానా గ్రామంలో, ఫలానా పేరు ఉన్న వ్యక్తి ఉన్నాడు. ఆయన నిన్ను చాలా ప్రేమిస్తాడు. నీవు కూడా ఆయనను ఎంతో ప్రేమిస్తావు. ఎందుకో తెలుసా? అతడు పూర్వజన్మలో నీ తండ్రి, తండ్రీ కొడుకులు కనుక మీ ఇద్దరి మధ్య అంత ప్రేమ వుంది. కానీ శరీరంలో మార్పు వచ్చింది. అందుచేత ఒకరినొకరు గుర్తించలేరు. ముంగేరులో ఉన్న పినతండ్రి నిన్ను ఎంతో ప్రేమిస్తాడు, నీతోనే ఉంటాడు. నువ్వు కూడా ఆయనను భక్తితో చూస్తావు. దానికి కారణం తెలుసా? పూర్వజన్మ సంబంధమే. అప్పటి స్నేహం అలాగే ఉంది. కాని శరీరాలు మాత్రం పరివర్తన చెందాయి.

చివరకు స్వామి ఇట్లా అన్నారు. "ఉమాచరణ్! నీ పూర్వ జన్మ సుకృతం వల్ల నెలవు పెట్టుకుని కాశీకి వచ్చావు. అందువలన బ్రాహ్మణోచితమైన సత్కర్మలు చేసి జన్మజన్మలలో నీకు కష్టం కలుగకుండా చూసుకో. నీవు ఈ జన్మను సరిగా ఉపయోగించుకున్నావా వచ్చే జన్మలో ముక్తి లభిస్తుంది. వాసనలు త్యజించటమే ముక్తికి సోపానము. వాసనలు త్యజించకపోతే ముక్తికి ఆశేలేదు."

స్వామివారు పలికిన ఈ అలౌకిక పలుకులు విని స్తబ్దుడనయ్యాను. జన్మజన్మల విషయంలో నా సందేహం తొలగి పోయింది. శాస్త్రానుకూలమైన నమ్మకం కుదిరింది.

స్వామి "నీవు ఇంటికి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని తొందరగా తిరిగిరా. ఈనాడు మనమిద్దరమూ కలసి స్నానం చేద్దాం" అన్నారు.

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

04-09-2026 నుండి 09-09-2026 వరకు

శ్రీ కాలేవనాశ్రమం నందు నిర్వహించిన

శ్రీకృష్ణాష్టమి వేడుకల దృశ్యములు.









REGD. NEWS MAGAZINE PERIODICAL
POSTED ON FIFTH AND SIXTH OF EVERY MONTH

RNI NO. 37804/81
POSTAL REGD. NO.: GTR/27/2024-26

15-09-2026 ను కామేపల్లిలో పునర్నిర్మాణంలో ఉన్న
శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత ఇష్టకామేశ్వర స్వామి
వారి దేవాలయ సందర్శనం







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.